E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 02-08-2025 (వారం) శనివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



ఈ నెలలో వర్షాలు సాధారణమే...» 3లో

# కాళేశ్వరం నివేదికపై కమిటీ



» అధ్యయనానికి ఇరిగేషన్, న్యాయ, జీఏడీ శాఖల కార్యదర్శులతో త్రిసభ్య కమిటీ
» నివేదికను అధ్యయనం చేసి సారాంశాన్ని సిద్ధం చేసే బాధ్యత
» సీఎం రేవంత్‌రెడ్డికి కమిషన్ నివేదిక అందించిన మంత్రి ఉత్తమ్
» కేబినెట్‌లో చర్చ తర్వాత అసెంబ్లీలోనూ చర్చకు పెట్టే యోచన
» ఆ తర్వాతే బాధ్యులపై చర్యలకు సిద్ధం కావాలని సర్కారు భావన

ఈకబురు,హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో సాంకేతిక లోపాలు, అవినీతిపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ (పీసీ ఘోష్) కమిషన్ సమర్పించిన నివేదికపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, న్యాయశాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతిని కమిటీలో సభ్యులుగా నియమించింది. నివేదికను అధ్యయనం చేసి.. దాని సారాంశం (జిస్ట్) సిద్ధం చేసే బాధ్యతను ఈ కమిటీకి అప్పగించింది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా తీసుకోవాల్సిన చర్యలను ఖరారు చేసేందుకు త్రిసభ్య కమిటీని నియమించింది. ఈ నెల 4వ తేదీన ఈ నివేదికపై చర్చించడానికి సింగిల్ పాయింట్ ఎజెండాతో మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఆ సమావేశంలో నివేదికపై విస్తృతంగా చర్చించి తదుపరి తీసుకోవాల్సిన చర్యలను ఖరారు చేసే అవకాశం ఉంది.

**సీఎం చేతికి నివేదిక**

జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డికి నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి కాళేశ్వరం కమిషన్ నివేదికను శుక్రవారం సీల్డ్ కవర్లలో అందజేశారు. నివేదికను అందుకున్న వెంటనే దానిపై అధ్యయనం కోసం కమిటీ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశాలు జారీచేశారు. 4న జరిగే మంత్రివర్గ సమావేశంలోపు నివేదిక సారాంశాన్ని ఈ కమిటీ అందించనుంది.

తరువాయి 2లో

# 25 శాతం సుంకాలు ఇక అధికారికం

» అన్నంత పనీ చేసిన ట్రంప్
» అధికారిక ఉత్తర్వులపై సంతకం
» భారత్‌పై పెంపు, పాక్‌పై 10% తగ్గింపు
» 69 దేశాలకు వడ్డింపులు వారంలో అమల్లోకి



తరువాయి 3లో

# త్వరలో కేంద్ర క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ!

» పలువురు మంత్రులకు ఉద్వాసన?.. కూర్పుపై ఆరెస్సెస్ ప్రభావం
» ఆగస్టు 15 తర్వాత బీజేపీ అధ్యక్షుడి ఎంపిక
» దక్షిణాది నుంచి బీసీకి ఉపరాష్ట్రపతి పదవి లభించే అవకాశం?
» మంత్రివర్గం నుంచి విముక్తి కల్పించండి: బండి సంజయ్



తరువాయి 3లో

బ్యాక్‌గ్రౌండ్ ఉన్నా.. నన్ను నాలుగు సినిమాల్లో రిజెక్ట్ చేశారు.. హీరో షాకింగ్ కామెంట్స్
» 5లో



# సంతాన సాఫల్య కేంద్రాలపై నజర్

**దశలవారీగా మిగతా జిల్లాల్లో**

**పోలీసుల విచారణకు సహకరించని డాక్టర్ నమ్రత**

**తనను ఇరికించారని ఆరోపణ**



ఈకబురు,హైదరాబాద్: కృత్రిమ గర్భధారణ చికిత్స(ఐవీఎఫ్), సరోగసీ పేరిట శిశువుల అక్రమ రవాణాకు పాల్పడిన 'సృష్టి' ఫర్టిలిటీ ఘటనతో సంతాన సాఫల్య కేంద్రాలపై ప్రభుత్వం దృష్టిసారించింది. శనివారం నుంచి ఫర్టిలిటీ కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు చేయనుంది. ఇందుకోసం వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆధ్వర్యంలో 35 తనిఖీ బృందాలను రంగంలోకి దింపింది. తొలుత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మూడు రోజుల పాటు తనిఖీలు చేపడతారు. తర్వాత దశలవారీగా జిల్లాల్లో నిర్వహిస్తారు. శుక్రవారం కమిషనర్ కార్యాలయంలో ఈ బృందాల్లో ఉండే సభ్యుల పేర్లను ఖరారు చేశారు. తనిఖీలకు సంబంధించిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని కమిషనర్ సంగీతా సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 307 సంతాన సాఫల్య కేంద్రాలు ఉన్నాయి. అందులో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 157 వరకు ఉన్నాయి. సంతాన సాఫల్య కేంద్రాల్లో తనిఖీల కోసం 29 అంశాలతో కూడిన చెక్‌లిస్టును కమిషనర్ కార్యాలయం సిద్ధం చేసింది. గ్రేటర్ హైదరాబాద్ తర్వాత ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో ఫర్టిలిటీ కేంద్రాలు ఎక్కువగా ఉన్నాయి. వాటిలో తనిఖీల కోసం రాష్ట్రస్థాయి నుంచి అధికారులను పంపే అవకాశం ఉందని వైద్య వర్గాలు పేర్కొన్నాయి.

తరువాయి 2లో

లోన్ ఫ్రాడ్ కేసులో అనిల్ అంబానీపై లుకౌట్ నోటీసులు
» 4లో



# జనవరి నుంచి 4 వేల మెగావాట్లు



» యాదాద్రి ప్లాంటులోని యూనిట్లన్నీ డిసెంబరులోగా పూర్తి
» బీఆర్ఎస్ తప్పిదాల వల్లే ఆలస్యం: భట్టి
» రైల్వే శాఖతో ముందుగానే సమన్వయం చేసుకోండి: ఉత్తమ్
» సమీప ప్రాంతాల అభివృద్ధి: కోమటిరెడ్డి
» వైటీపీఎస్‌లో 800 మెగావాట్ల యూనిట్1 జాతికి అంకితం

తరువాయి 2లో

తొలి సినిమాతోనే సత్తా చాటిన సుకుమార్ కూతురు
» 5లో



# గొర్రెల స్కామ్ రూ.1,000 కోట్లపైనే!



» స్వాధీనం చేసుకున్న ఆధారాల ప్రకారం అంచనా వేస్తున్నాం
» గొర్రెలు కొనకుండానే.. లబ్ధిదారులు లేకుండానే నిధులు మళ్లించారు
» 200 మ్యూల్ బ్యాంకు ఖాతాల్లోకి గొర్రెల కొనుగోలు సొమ్ము పంపారు
» ఈ ఖాతాలకు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లతో లింక్‌లు గుర్తించాం
» నాటి మంత్రి తలసాని ఓఎస్డీ కల్యాణ్ ఇంట్లో సోదాల్లో కీలక పత్రాలు
» వివరాలు వెల్లడించిన ఈడీ జాయింట్ డైరెక్టర్ కార్యాలయం

తరువాయి 2లో

# అణు బాంబు లాంటి సాక్ష్యం ఉంది



» 3లో

# కమ్యూనిస్టుల సహకారం ఇలాగే కొనసాగాలి




# బీఆర్ఎస్‌కు ఎంపీలు ఉంటే లోక్‌సభలో కొట్లాడేవారు: కేసీఆర్

» బనకచర్లపై రాజకీయ, న్యాయపరమైన పోరాటం
» కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేలా సభ
» సుప్రీం తీర్పు నేపథ్యంలో ఉపఎన్నికలు ఖాయం
» కాంగ్రెస్, బీజేపీ ఎంపీల చేతగానితనంతో తెలంగాణకు అన్యాయం
» ముఖ్య నేతలతో కొనసాగుతున్న కేసీఆర్ భేటీ



తరువాయి 2లో

నన్ను మోసగాడు అన్నారు.. సూసైడ్ ఆలోచనలూ వచ్చాయ్:
» 6లో



# అత్యాచారం కేసులో నేరం రుజువు

» ప్రజ్వల్ రేవణ్ణ దోషి
» తీర్పు వెలువరించిన బెంగళూరు కోర్టు
» నేడు శిక్ష ఖరారు
» తీర్పు విని కోర్టు హాల్లో ఏడ్చిన ప్రజ్వల్
» జేడీఎస్ మాజీ ఎంపీపై నమోదైన నాలుగు అత్యాచార కేసుల్లో ఇదొకటి



తరువాయి 2లో

# 'ఎఫ్–35' కొనుగోళ్లు బంద్!

» 3లో



మొదటి పేజీ తరువాయి

# కాళేశ్వరం నివేదికపై కమిటీ



కేబినెట్‌లో చర్చించిన తర్వాత రానున్న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో నివేదికను ప్రభుత్వం సభ ముందుంచే అవకాశాలు ఉన్నాయి. శాసనసభలో దీనిపై చర్చించాకే తదుపరి చర్యల దిశగా అడుగులు పడతాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, నివేదిక అందించే సమయంలో అక్కడే ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సీఎం కొద్దిసేపు చర్చించినట్లు తెలిసింది.

**ప్రణాళిక లోపమేనా?**

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ 2023 అక్టోబర్ 21న కుంగిపోగా.. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సైతం బుంగలు ఏర్పడి నీళ్లు సీపేజీ అయిన విషయం విదితమే. ఈ నిర్మాణ లోపాలతోపాటు అవినీతి ఆరోపణలపై విచారణ కోసం 2024 మార్చి 14న సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్‌తో విచారణ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. బరాజ్‌లకు సంబంధించి ప్రణాళిక, నమూనాలు, నాణ్యత, నిర్వహణ ప్రధాన లోపాలు కాగా, స్థల ఎంపిక కూడా ఇందుకు కారణమన్న అభిప్రాయాన్ని కమిషన్ తన నివేదికలో వ్యక్తంచేసినట్లు చెబుతున్నారు. ఈ బరాజ్‌ల నిర్మాణంలో పాలుపంచుకున్న ఇంజనీర్ ఇన్ చీఫ్‌లు, చీఫ్ ఇంజనీర్లు, ఎస్‌ఈలు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు, నీటిపారుదల శాఖ కార్యదర్శులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు సహా దాదాపు 150 మందిని విచారించిన తరువాత ఈ నివేదికను నివేదిక రూపొందించారు. ప్రాజెక్టు నిర్మాణంలో అవకతకలు చోటు చేసుకున్నట్లు కమిషన్ నివేదికలో వెల్లడించినట్లు చెబుతున్నారు. ప్రధానంగా తుమ్మిడి హెట్టి నుంచి మేడిగడ్డకు బరాజ్ లొకేషన్ మార్పుపై నిర్ణయం ఎవరు తీసుకున్నారు? అనే అంశంపై కమిషన్ స్పష్టతనిచ్చిందని అంటున్నారు.

మొదటి పేజీ తరువాయి

# బీఆర్ఎస్‌కు ఎంపీలు ఉంటే
## లోక్‌సభలో కొట్లాడేవారు: కేసీఆర్



ఈకబురు,హైదరాబాద్: బనకచర్ల లింకు ప్రాజెక్టును నిర్మించి తీరుతామని ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్, రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉండటాన్ని ఎండగట్టాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్‌కు లోక్‌సభలో డజను మంది ఎంపీలు ఉంటే బనకచర్ల అంశంపై గట్టిగా కొట్లాడేవారని పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీల చేతగానితనంతో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బనకచర్లపై రాజకీయ, న్యాయపరమైన పోరాటానికి బీఆర్ఎస్ సన్నద్ధం కావాలని ఆదేశించారు. సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో పాటు బహిరంగ సభ నిర్వహించాలనే అభిప్రాయాన్ని కేసీఆర్ వ్యక్తం చేశారు. ఎర్రవల్లి నివాసంలో మూడు రోజులుగా ముఖ్య నేతలతో భేటీ నిర్వహిస్తున్న కేసీఆర్ శుక్రవారం కూడా సమావేశం కొనసాగించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డితో పాటు శుక్రవారం జరిగిన భేటీలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కూడా పాల్గొన్నారు. - రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాన్ని ప్రదర్శిస్తోందని కేసీఆర్ వ్యాఖ్యానించారు. 'బీసీ రిజర్వేషన్ల అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేలా పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేయాలి. 8న కరీంనగర్‌లో సభ తర్వాత రాష్ట్రపతిని పార్టీ ప్రతినిధి బృందం కలిసి బీసీ రిజర్వేషన్ల కోసం విజ్ఞప్తి చేద్దాం'అని కేసీఆర్ సూచించారు. - సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు ఖాయమని కేసీఆర్ స్పష్టం చేశారు. ఉప ఎన్నికల సన్నద్ధతను ఇప్పటినుంచే ప్రారంభించాలని ఆదేశించారు. - స్థానికసంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించేలా గట్టిగా కృషి చేయాలి. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం ఎప్పుడు నిర్వహిస్తుందనే అంశంపై స్పష్టత లేదు. అయినా ఎన్నికల సన్నద్ధతకు పార్టీ నేతలు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వాలి. - స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారిద్దాం. ప్రభుత్వ విధానాలు, తెలంగాణకు జరిగే అన్యాయాలు, అసెంబ్లీ ఉప ఎన్నికలు, స్థానిక ఎన్నికల్లో పార్టీ యంత్రాంగం పూర్తి స్థాయిలో నిమగ్నమయ్యేలా కార్యాచరణ ఉంటుందని ఈ భేటీల్లో కేసీఆర్ ప్రకటించారు.

మొదటి పేజీ తరువాయి

# గొర్రెల స్కామ్ రూ.1,000 కోట్లపైనే!

ఈకబురు,హైదరాబాద్: గొర్రెల పంపిణీ పథకంలో రూ.వెయ్యి కోట్లకుపైనే గోల్‌మాల్ జరిగినట్టు ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అంచనాకు వచ్చారు. ఈ మేరకు ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. మొత్తం 200లకు పైగా మ్యూల్, డమ్మీ బ్యాంక్ అకౌంట్లతో ప్రభుత్వ అధికారులు, ప్రైవేట్ వ్యక్తులు, బ్రోకర్లు కలిసి సర్కార్ ఖజానాకు గండి కొట్టినట్టు ఈడీ వెల్లడించింది. గొర్రెల పంపిణీ పథకం కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం ఎనిమిది ప్రాంతాల్లో నిర్వహించిన సోదాల్లో పలు కీలక ఆధారాలు లభించినట్టు ఈడీ అధికారులు తెలిపారు. నాటి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఓఎస్డీగా ఉన్న జి.కల్యాణ్‌కుమార్, కొందరు వినియోగదారులు, మరో మధ్యవర్తి ఇంట్లో ఈ సోదాలు చేసినట్టు పేర్కొన్నారు. సోదాల్లో భాగంగా 200 డమ్మీ, మ్యూల్ అకౌంట్లకు చెందిన బ్యాంక్ డాక్యుమెంట్లు, చెక్, పాస్ బుక్స్, డెబిట్ కార్డులు, 31 మొబైల్ ఫోన్లు, 20కి పైగా సిమ్ కార్డులను స్వాధీనంచేసు కున్నట్టు తెలిపారు. ఈ అకౌంట్ల ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌కు జరి గిన లావాదేవీల లింకులను కూడా ఈడీ అధికారులు గుర్తించారు. గొర్రెల పంపిణీ పథ కంలో కొల్లగొట్టిన కోట్ల రూపాయలను దారి మళ్లించేందుకు బెట్టింగ్ యాప్స్‌ను ఉప యోగించినట్టు ఈడీ ఆధారాలు సేకరించింది.

**రూ.2.1 కోట్లతో మొదలై.. రూ.వందల కోట్లకు**

గొర్రెల పెంపకం, అభివృద్ధి పథకం (షీప్ రియరింగ్ డెవలప్‌మెంట్ స్కీం-ఎస్ఆర్‌డీఎస్) కేసు ఆది నుంచి కీలక మలుపులు తిరుగుతోంది. తమ వద్ద కొనుగోలు చేసిన గొర్రెల యూనిట్లకు సంబంధించి రూ.2.1 కోట్ల డబ్బు తమకు ఇవ్వకుండా పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు అక్రమంగా ఇతర అకౌంట్లకు మళ్లించారని కొందరు గొర్రెల విక్రేతలు ఇచ్చిన ఫిర్యాదుతో తొలుత ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఓఎస్డీగా ఉన్న జి.కల్యాణ్‌కుమార్ పశు సంవర్ధక శాఖ కార్యాలయంలోని కొన్ని రికార్డులను ధ్వంసం చేసి తీసుకెళ్లాడు. ఈ రెండు కేసుల ఆధారంగా ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసిన దర్యాప్తు ప్రారంభించారు. కల్యాణ్‌కుమార్ సహా ఫిష్ అండ్ గోట్స్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ మాజీ సీఈఓ రాంచందర్‌నాయక్, మాజీ అసిస్టెంట్ డైరెక్టర్లు రవికుమార్, కేశవసాయి, శ్రీనివాస్‌రావు, బ్రోకర్లు సహా మొత్తం 17 మందిని ఏసీబీ అరెస్ట్ చేసింది. ఏసీబీ కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు ప్రారంభించిన ఈడీ అధికారులు పీఎంఎల్ఏ (ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్-2002) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కుంభకోణంలో తొలుత రూ.2.1 కోట్ల మేర అవినీతి బహిర్గతమైంది. ఆ తర్వాత కాగ్ ఇచ్చిన నివేదికతో రూ.253.93 కోట్లకు ఈ కుంభకోణం చేరింది. తాజాగా ఈడీ అధికారుల సోదాల్లో లభించిన ఆధారాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో కలిపి మొత్తం రూ.వెయ్యికోట్లకుపైనే అవినీతి జరిగినట్టు వెలుగులోకి వచ్చింది.

**గొర్రెల పంపిణీ చేయకుండానే..నిధులు పంచుకుతిన్నారు**

గొర్రెల పంపిణీ పథకంలో 'నీకిది నాకది'(కిక్‌బ్యాక్)



తరహాలో ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులు, సంస్థల ఖాతాల్లోకి భారీగా నిధులు మళ్లించినట్టు ఈడీ ఆధారాలు సేకరించింది. ప్యాసింజర్ వాహనాలు, నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు సహా నకిలీ రిజిస్ట్రేషన్ నంబర్లతో బిల్లులు, గొర్రెల యూనిట్లకు డూప్లికేట్ ట్యాగ్‌లు, మృతి చెందిన వారి పేర్లతో యూనిట్లు కేటాయించడం వంటి అక్రమాలను గుర్తించింది. గొర్రెల స్కీమ్ నిధులు డిపాజిట్ అయిన లబ్ధిదారుల్లో చాలామంది ఈ పథకం ప్రారంభానికి ముందు గొర్రెల వ్యాపారంలో లేరని ఈడీ అధికారులు నిర్ధారించారు. ఎటువంటి కొనుగోలు, అమ్మకాలు జరగలేదని గుర్తించారు. కేవలం కాగితాలపైనే గొర్రెల కొనుగోలు, నకిలీ వాహనాలు, లబ్ధిదారుల పేర్లతో ప్రభుత్వ నిధులను నకిలీ సరఫరాదారుల ఖాతాల్లోకి మళ్లించారని తేల్చారు. నకిలీ సరఫరాదారులకు చెల్లింపులు, గొర్రెలను మళ్లీమళ్లీ చూపించి ప్రభుత్వ నిధులను కొల్లగొట్టి భారీ అక్రమాలకు తెర తీసినట్టు ఈడీ అధికారులు ఆధారాలు సేకరించారు. లబ్ధిదారుల వివరాలు సరిగ్గా నిర్వహించకపోవడం, రవాణా వాహనాల బిల్లు, చెల్లింపుల రికార్డులు, ఇన్‌వాయిస్‌లు సరిగ్గా లేని రికార్డులను ఈడీ స్వాధీనం చేసుకుంది.

**తాజా సోదాల్లో కీలక ఆధారాలు**

కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు బుధవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని జి.కల్యాణ్‌కుమార్ ఇంటితోపాటు రాంచందర్‌నాయక్, రవికుమార్, కేశవసాయి, శ్రీనివాస్‌రావు, లోలోనా ది లైవ్ కాంట్రాక్ట్ సంస్థ యజమానులు మొయిద్దీన్, ఇక్రముద్దీన్ ఇళ్లు, ఆఫీసులు సహా మొత్తం 8 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ వ్యవహారంలో కీలక సూత్రధారి అయిన కల్యాణ్‌కుమార్ ఇంట్లో పలు కీలక ఆధారాలు ఈడీ అధికారులు గుర్తించారు. డమ్మీ, మ్యూల్ అకౌంట్లకు చెందిన బ్యాంక్ డాక్యుమెంట్లు, చెక్, పాస్‌బుక్స్, డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధ, గురువారాల్లో కల్యాణ్‌కుమార్‌తోపాటు మరో ఇద్దరిని బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి పిలిపించిన అధికారులు.. వారిని వేర్వేరుగా విచారించారు. కల్యాణ్‌కుమార్ అరెస్టుకు ఈడీ అధికారులు చర్యలు ప్రారంభించినట్టు తెలిసింది.

**బెట్టింగ్‌యాప్ వ్యవహారంతో కొత్త మలుపు**

ఇప్పటి వరకు గొర్రెల కొనుగోళ్లలో అక్రమాలు..గొర్రెల పంపిణీ పేరిట లబ్ధిదారులకు చేరకుండానే నిధుల మళ్లింపునకు పరిమితమైన ఈ కుంభకోణంలో ఈడీ తాజా తనిఖీలతో బెట్టింగ్‌యాప్‌ల లింక్ బయటపడింది. గొర్రెల కొనుగోలు కుంభకోణం నిధుల మళ్లింపునకు వాడిన డమ్మీ, మ్యూల్ అకౌంట్లకు చెందిన బ్యాంక్ డాక్యుమెంట్లు, చెక్, పాస్‌బుక్స్, డెబిట్ కార్డులు ఓ ఆన్‌లైన్ బెట్టింగ్‌యాప్‌తో లింక్ అయినట్టు అధికారులు గుర్తించారు. గొర్రెల కొనుగోలు డబ్బును విదేశాలకు చేర్చేందుకు లేదంటే దారి మళ్లించేందుకు ఈ బెట్టింగ్ యాప్స్‌ను వాడుకున్నారా? అన్న కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# ఈ నెలలో వర్షా లు సాధారణమే...



ఈ-కబురు,హైదరాబాద్: రాష్ట్రంలో వర్షా లు సాధారణ స్థితిలోనే నమోదవుతున్నాయి. నైరుతి రుతుపవనాల సీజన్‌లో జూన్ నెలలో తీవ్ర లోటువర్షపాతం నమోదు కాగా... జూలైలో కాస్త ఆశాజనకంగా వర్షా లు కురిశాయి. దీంతో రాష్ట్ర వర్షపాతం గణాంకాలు సాధారణ స్థితికి చేరాయి. ప్రస్తుతం నాలుగైదు రోజులుగా వర్షా లు తగ్గుముఖం పట్టడంతో రాష్ట్ర సగటు గణాంకాలు లోటు దిశగా పడిపోతున్నాయి. ప్రస్తుతం ఆగస్టు నెలలో వర్షా లు సాధారణ స్థితిలో నమోదవుతాయని, కొన్ని ప్రాంతాల్లో సాధారణంకంటే తక్కువ వర్షా లు కురుస్తాయని వాతావరణ శాఖ వేసిన అంచనాలు కొంత ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆగస్టు నెల వర్షపాతం అంచనాలను ఐఎండీ విడుదల చేసింది. ఈ నెలలో వర్షా లు సాధారణ స్థితిలో నమోదవుతాయని, 94 శాతం నుంచి 106 శాతం మధ్యలో వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి రుతుపవనాల సీజన్ ద్వితీయార్థంలో వర్షా లు సాధారణం కంటే ఎక్కువగా నమోదైతేనే రైతాంగానికి లాభం చేకూరుతుందని వ్యవసాయ శాఖ చెబుతుండగా.. తాజాగా వాతావరణ శాఖ వెల్లడించిన గణాంకాలు ఒకింత ఆందోళన కలిగిస్తున్నాయి.

**మండుతున్న ఎండలు...**

రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. పగటి పూట తీవ్ర ఉక్కపోతతో కూడిన వాతావరణం... రాత్రిపూట సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నైరుతి రుతుపవనాల సీజన్‌లో భాగంగా ద్వితీయార్థం ఉష్ణోగ్రతలు తగ్గాల్సి ఉండగా... ప్రస్తుతం అధికంగా నమోదవుతుండటం ఆందోళన కలిగించే విషయం. ఈ నెలలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలో నమోదవుతాయని, రాత్రిపూట మాత్రం సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని సూచించింది.

నైరుతి సీజన్లో ఆగస్టు 1 వరకు 36.36 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 34.24 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మూడు జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా... 24 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, 6 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

మొదటి పేజీ తరువాయి

# అత్యాచారం కేసులో నేరం రుజువు



ఈకబురు,బెంగళూరు: కర్ణాటకతో పాటు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అత్యాచారం కేసులో జేడీఎస్ బహిష్కృత నేత, మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ (34)ను బెంగళూరు కోర్టు దోషిగా తేల్చింది. గత ఏడాది హాసన్ జిల్లాలో ఆయనపై నమోదైన నాలుగు రేప్ కేసుల్లో ఒకదానిలో దోషిగా తేలుస్తూ స్థానిక ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. న్యాయాధికారి సంతోష్ గజానన్ భట్ శనివారం శిక్ష ఖరారు చేయనున్నారు. జడ్జి తీర్పు వినగానే.. ప్రజ్వల్ రేవణ్ణ కోర్టు హాల్‌లోనే విలపించాడు. తమ కుటుంబానికి చెందిన ఓ ఫాంహౌస్‌లో ఇంట్లో పనిచేసే మహిళపై అత్యాచారం చేసి, ఆ దురాగతాన్ని వీడియో తీసినట్లు పేర్కొంటూ నమోదైన కేసులో కోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. ప్రజ్వల్ రేవణ్ణ దీంతోసహా నాలుగు రేప్ కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. రేవణ్ణ పలువురు మహిళలపై లైంగిక దాడులకు పాల్పడినట్లు ఆరోపిస్తూ 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు భారీగా వీడియోలు బయటకు రావడం సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ పరిణామం తర్వాత ఆయనపై నాలుగు రేప్ కేసులు నమోదయ్యాయి. అప్పుడు హాసన్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి జేడీఎస్ అభ్యర్థిగా పోటీచేసిన రేవణ్ణ ఓడిపోయారు. ప్రజ్వల్ రేవణ్ణ మాజీ ప్రధాని, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు హెచ్‌డీ దేవెగౌడ మనవడు. ప్రజ్వల్ రేవణ్ణపై రేప్ కేసు నమోదైన తర్వాత ఆయన్ను జేడీఎస్ నాయకత్వం పార్టీ నుంచి బహిష్కరించింది.

ప్రస్తుత కేసు నేపథ్యమిదీ..

మైసూరు జిల్లా కేఆర్ నగర్‌కు చెందిన 48 ఏళ్ల ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గత ఏడాది ఏప్రిల్ 28న ప్రజ్వల్‌పై అత్యాచార కేసు నమోదైంది. హాసన్ జిల్లా హోళెనరసీపురలోని వారి కుటుంబానికి చెందిన ఫాంహౌస్‌లో పనిచేసే మహిళ.. రేవణ్ణ తనపై 2021లో రెండుసార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫాంహౌస్‌లో, బెంగళూరు బసవనగుడిలోని ఆయన తండ్రి రేవణ్ణ నివాసంలో అత్యాచారం చేసినట్లు బాధితురాలు పేర్కొన్నారు. ఆ దురాగతాన్ని మొబైల్ ఫోన్‌లో వీడియో తీశాడని తెలిపారు. ప్రజ్వల్ కేసు దర్యాప్తు కోసం ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో బాధితురాలిని ప్రజ్వల్ తండ్రి రేవణ్ణ, తల్లి భవాని కిడ్నాప్ చేశారు. సిట్ పోలీసులు 2024 సెప్టెంబరులో ఆమెను రక్షించారు. అంతకుముందు మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియోలు 2024 ఏప్రిల్ 26న బయటకు వచ్చిన తర్వాత ప్రజ్వల్ జర్మనీకి పారిపోయాడు. తిరిగొచ్చిన రేవణ్ణను పోలీసులు బెంగళూరు విమానాశ్రయంలో మే 31 పోలీసులు అరెస్టు చేశారు. హోలేనరసిపుర పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసులో ముమ్మర దర్యాప్తు జరిపిన ప్రత్యేక దర్యాప్తు బృందం 1,632 పేజీలతో గత ఏడాది డిసెంబరులో చార్జిషీట్ దాఖలు చేసింది. 113 మంది సాక్షులను విచారించినట్లు పేర్కొంది. ఆ తర్వాత ఈ ఏడాది ఏప్రిల్ 3న అభియోగాలు మోపింది. ప్రజ్వల్ పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో 14 నెలలుగా ఉంటున్నారు. బాధిత మహిళకు న్యాయం జరిగిందని కాంగ్రెస్ మాజీ ఎంపీ, నటి రమ్య ఎక్స్‌లో స్పందించారు.

మొదటి పేజీ తరువాయి

# సంతాన సాఫల్య కేంద్రాలపై నజర్

ఈకబురు,హైదరాబాద్: కృత్రిమ గర్భధారణ చికిత్స(ఐవీఎఫ్), సరోగసీ పేరిట శిశువుల అక్రమ రవాణాకు పాల్పడిన 'సృష్టి' ఫర్టిలిటీ ఘటనతో సంతాన సాఫల్య కేంద్రాలపై ప్రభుత్వం దృష్టిసారించింది. శనివారం నుంచి ఫర్టిలిటీ కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు చేయనుంది. ఇందుకోసం వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆధ్వర్యంలో 35 తనిఖీ బృందాలను రంగంలోకి దింపింది. తొలుత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మూడు రోజుల పాటు తనిఖీలు చేపడతారు. తర్వాత దశలవారీగా జిల్లాల్లో నిర్వహిస్తారు. శుక్రవారం కమిషనర్ కార్యాలయంలో ఈ బృందాల్లో ఉండే సభ్యుల పేర్లను ఖరారు చేశారు. తనిఖీలకు సంబంధించిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని కమిషనర్ సంగీతా సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 307 సంతాన సాఫల్య కేంద్రాలు ఉన్నాయి. అందులో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 157 వరకు ఉన్నాయి. సంతాన సాఫల్య కేంద్రాల్లో తనిఖీల కోసం 29 అంశాలతో కూడిన చెక్‌లిస్టును కమిషనర్ కార్యాలయం సిద్ధం చేసింది. గ్రేటర్ హైదరాబాద్ తర్వాత ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో ఫర్టిలిటీ కేంద్రాలు ఎక్కువగా ఉన్నాయి. వాటిలో తనిఖీల కోసం రాష్ట్రస్థాయి నుంచి అధికారులను పంపే అవకాశం ఉందని వైద్య వర్గాలు పేర్కొన్నాయి.

**విచారణకు సహకరించని నమ్రత**

సంతాన సాఫల్య చికిత్స కోసం వచ్చిన దంపతులను మోసం, శిశువుల విక్రయం కేసులో అరెస్టయిన 'సృష్టి' సంతాన సాఫల్య కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతను గోపాలపురం పోలీసులు శుక్రవారం విచారించారు. కోర్టు ఐదు రోజుల కస్టడీకి అనుమతించిన నేపథ్యంలో శుక్రవారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి ఆమెను కస్టడీలోకి తీసుకున్నారు. గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించి, నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయానికి తరలించారు. సాయంత్రం 6గంటల దాకా విచారించి, బేగంపేట మహిళా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే విచారణలో అధికారుల ప్రశ్నలకు నమ్రత సమాధానం ఇవ్వకుండా దాటవేసినట్టు తెలిసింది. తానెలాంటి తప్పూ చేయలేదని చెబుతూ వచ్చినట్టు సమాచారం. మరోవైపు సృష్టి ఫర్టిలిటీ కేంద్రంలో చికిత్స చేయించుకున్న వారి వివరాలను సేకరిస్తున్నారు. బాధితులపై నమ్రత కుమారుడు జయంత్ కృష్ణ బెదిరింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలపైనా ఆరా తీస్తున్నారు. కాగా, వైద్య పరీక్షల కోసం గాంధీ ఆస్పత్రికి తీసుకువ



చ్చిన సమయంలో నమ్రత మాట్లాడుతూ.. రాజస్థాన్ దంపతులు, పోలీసులు తనను ఈ కేసులో ఇరికించారని ఆరోపించారు. తాను బయటికి వచ్చాక అన్ని విషయాలు చెబుతానన్నారు.

మొదటి పేజీ తరువాయి

# జనవరి నుంచి 4 వేల మెగావాట్లు

ఈకబురు,: యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో అన్ని యూనిట్లను డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని, జనవరి నుంచి 4 వేల మెగావాట్ల (పూర్తి స్థాయిలో) విద్యుదుత్పత్తి చేపడతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మం డలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్(వైటీపీఎస్)లో శుక్రవారం 800 మెగావాట్ల సామ ర్థ్యం కలిగిన యూనిట్ 1ను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆయన జాతికి అంకితం చేశారు. పవర్‌ప్లాంటు ఆవరణలో 65ఎకరాల విస్తీర్ణంలో రూ.970 కోట్లతో నిర్మిస్తోన్న ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం జెన్‌కో అధికారులతో డిప్యూటీ సీఎం, మంత్రు లు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాల వల్లనే యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటు నిర్మాణం జాప్యమైందన్నారు. పర్యావరణ, అటవీ శాఖల అనుమతులు తీసుకోకుండా ప్లాంటు నిర్మాణం ప్రారంభించడం.. గత ప్రభుత్వ నిర్లక్ష్యమేనని మండిపడ్డారు. ప్రజాప్రభుత్వం కొలువుదీరినతర్వాత కేంద్రం నుంచి అన్ని అనుమతులు సాధించామని, ఒక్కో యూనిట్‌ను ప్రారంభిస్తూ వస్తున్నామని వివరించారు. ప్లాంటు నిర్మాణానికి భూములిచ్చిన, ఇళ్లు కోల్పోయిన వారి త్యాగాలను గుర్తుంచుకుంటామని, ఈ నెల 15వ తేదీలోగా వారికి ఉద్యోగాలు ఇస్తామని భరోసా ఇచ్చారు. పులిచింతల ప్రాజెక్టు నిర్వాసితులకు కూడా ఈలోపే ఉద్యోగాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. భూనిర్వాసితులకు పరిహారాలివ్వకుండా, ఉద్యోగఉపాధి కల్పన చేపట్టకుండా గత ప్రభుత్వం గాలికి వదిలేసిందని దుయ్యబట్టారు. ప్లాంటులో పూర్తి స్థాయి విద్యుదుత్పత్తి జరిగే నాటి కన్నా ముందే రైల్వే శాఖతో సమన్వయం చేసుకోవాలని, బొగ్గు సరఫరాకు ఇబ్బందుల్లేకుండా చూసుకోవాలని జెన్‌కో అధికారులకు మంత్రి ఉత్తమ్ సూచించారు. తాను ఎంపీగా ఉన్న సమయంలోనే విష్ణుపురం దాకా డబుల్ రైల్వే లైన్ మంజూరైనా.. ఇప్పటికీ పూర్తి కాలేదని గుర్తు చేశారు. 93కిలోమీటర్ల డబుల్ లైన్‌కు సరిపడా నిధులు కేంద్రం నుంచి రాకపోవడం వల్లే జాప్యం జరుగుతోందన్నారు. కాగా, ప్లాంట్ సమీపంలోని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. త్వరలోనే ఇక్కడ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తామని, అత్యాధునిక వసతులతో ఆస్పత్రులు, అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తెస్తామని ఆయన పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ఉద్యోగుల ఇళ్ల స్థలాల కోసం న్యాయ పోరాటం: టీఎన్జీవో జెఏసి నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవో జేఏసీ, బీటీఎన్జీవో నాయకులు



నిరసన దీక్షకు హాజరైన ఉద్యోగులు

గోపన్ పల్లిలో 18వ రోజుకు చేరిన నిరసన దీక్ష

ఈకబురు, శేరిలింగంపల్లి : గోపన్ పల్లిలోని టీఎన్జీవో ఉద్యోగుల ఇళ్ల స్థలాల కోసం న్యాయపోరాటానికి దిగుతామని, బీటీఎన్జీవో ఉద్యోగుల కోసం కేటాయించిన భూమి ఆక్రమణపై చేపడుతున్న శాంతియుత నిరసనను కొనసాగిస్తామని టీఎన్జీవో జెఎసి, బీటీఎన్జీవో నాయకులు తేల్చి చెప్పారు. భాగ్యనగర్ టీఎన్జీవో హౌజింగ్ సొసైటీ ఆధ్వర్యంలో గోపనపల్లిలో చేపడుతున్న నిరసన దీక్ష 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం టిఎన్జిఓ జెఎసి నాయకులు నిరసన శిబిరానికి హాజరై ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉద్యోగ సంఘాల జెఎసి రాష్ట్ర చైర్మన్, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపన్ పల్లిలో ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగుల కోసం కేటాయించిన భూమిని నేడు కొంతమంది కోర్టు ఆర్డర్ పేరుతో ఆక్రమించుకుంటున్నారని వాపోయారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ స్థలంగా ఉన్న భూమి ప్రస్తుత ప్రభుత్వంలో ప్రైవేటు స్థలంగా ఏ విధంగా మారిందని ప్రశ్నించారు. భాగ్యనగర్ టిఎన్జిఓ అసోసియేషన్ ఉద్యోగులు తమ జీవితకాలం ఉద్యోగ విధులు నిర్వహించారని, దశాబ్దాలుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. పక్కనే తోటి ఉద్యోగులు సొంత ఇళ్లు కట్టుకొని సంతోషంగా ఉంటే తమ ఉద్యోగులు మాత్రం ఇళ్ల స్థలం కోసం రాత్రింభవళ్లు పోరాడవలసి వస్తుందన్నారు. గోపన్ పల్లిలోని భాగ్యనగర్ టిఎన్జిఓ ఉద్యోగుల భూమి కోసం త్వరలో ముఖ్యమంత్రిని కలిసి విన్నవిస్తామని అన్నారు. భాగ్యనగర్ టీఎన్జిఓ హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగుల కోసం గోపన్ పల్లిలోని సర్వే నెంబర్లు 36,37లలో 428 ఎకరాలను నాటి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందులో సర్వే నెంబరు 36లోని 142 ఎకరాల భాగ్యనగర్ టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ భూమిలో కోర్టు ఆర్డర్ పేరుతో రాత్రికి రాత్రే 18 ఎకరాలకు ప్రైవేటు వ్యక్తులు ఫెన్సింగ్ వేశారని వాపోయారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన భూమి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తుందని అన్నారు. 142 ఎకరాల భూమిపై కోర్టు స్టేటస్ కో ఉన్నా సైతం రెవెన్యూ అధికారులు సర్వే చేసి ప్రైవేటుకు అప్పజెప్పారని, అటు ప్రభుత్వానికి, ఇటు బిటిఎన్జీవో హౌసింగ్ సొసైటీకి ఎక్స్ పార్టీ ఇవ్వకుండా చేశారని వాపోయారు. ఈ విషయమై రెవెన్యూ మంత్రిని కలిసి విన్నవిస్తే న్యాయపోరాటం ద్వారా సమస్య పరిష్కరించుకోవాలని సూచించారన్నారు. ఉద్యోగుల ఇళ్ల స్థలాల కోసం న్యాయ పోరాటం చేపడుతామని, ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు నిరసన దీక్షను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజిఓ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావుతో పాటు కస్తూరి వెంకటేష్, వివిధ జిల్లాల ఉద్యోగ సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# త్వరలో కేంద్ర క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ!

ఈకబురు,/న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగిశాక (ఆగస్టు 20 తర్వాత).. ఏ రోజైనా కేంద్ర మంత్రివర్గాన్ని పెద్ద ఎత్తున పునర్వ్యవస్థీకరించే అవకాశం ఉందని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఈ పునర్వ్యవస్థీకరణలో పలువురు మంత్రులకు ఉద్వాసన పలుకుతారని.. ముఖ్యంగా కొంతమంది మాజీ బ్యూరోక్రాట్లను పక్కన పెడతారని భావిస్తున్నారు. వారి స్థానంలో.. పార్టీలో చిరకాలం పనిచేసిన, సంఘ్‌కు సన్నిహితులైన వారికి స్థానం లభిస్తుందని, మంత్రివర్గ కూర్పుపై సంఘ్ ప్రభావం ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. విదేశాంగమంత్రి జైశంకర్‌తో పాటు హర్దీప్ పురి, అర్జున్ రాం మేఘ్వాల్, అశ్వినీ వైష్ణవ్.. బ్యూరోక్రసీ నుంచి వచ్చి మోదీ ప్రభుత్వంలో మంత్రులుగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. వీరిలో ఎవరిని తప్పిస్తారన్న విషయం చర్చనీయాంశంగా మారింది. వీరు కాక అనేకమందిని పనితీరు ఆధారంగా తప్పించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. వారిలో కొందరికి జాతీయ స్థాయిలో, రాష్ట్రాల్లో పార్టీ బాధ్యతలను అప్పగించాలని యోచిస్తున్నారు. కాగా.. ఉపరాష్ట్రపతి పదవికి నామినేషన్లు దాఖలు చేసేందుకు తుది గడువు ఆగస్టు 21 కావడం వల్ల.. బీజేపీ తరఫున నామినేషన్ దాఖలు చేసేది ఎవరనే అంశంపై మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగేలోపే స్పష్టతరానుంది. ఆ పదవికి.. రాజ్‌నాథ్ సింగ్, జగత్ ప్రకాశ్ నడ్డా వంటివారి పేర్లు వినిపించడంతోపాటు దక్షిణాది నుంచి బీసీని నియమించాలనే ప్రతిపాదనపైనా మంతనాలు జరుగుతున్నాయి. ఇక ఆగస్టు 15 తర్వాత బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ కూడా ప్రారంభమవుతుందని, ఈ విషయంపై పార్టీ అగ్రనేతలకు మధ్య అవగాహన దాదాపు కుదిరినట్లేనని పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ అధ్యక్ష పదవికి సంబంధించి శివరాజ్ సింగ్ చౌహాన్, ధర్మేంద్రప్రధాన్, మనోహర్ లాల్ ఖట్టర్, ప్రహ్లాద్ జోషి తదితరుల పేర్లు చర్చకు వస్తున్నాయి.నాకొద్దీ మంత్రి పదవి.. కేంద్ర మంత్రివర్గం నుంచి తనకు విముక్తి కల్పించాల్సిందిగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాను కోరినట్లు తెలిసింది. ఈ బాధ్యతల కారణంగా తాను పార్టీలో క్రియాశీలంగా వ్యవహరించలేకపోతున్నానని.. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు పూర్తిస్థాయిలో కృషి చేయాలనుకుంటున్నానని వారికి ఆయన చెప్పినట్లు సమాచారం. సంఘ్ పెద్దల వద్ద కూడా బండి సంజయ్ తన మనోగతాన్ని వెల్లడించి వారి ఆమోదాన్ని పొందినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో మంత్రివర్గ పునర్వ్యస్థీకరణలో భాగంగా ఆయన స్థానంలో లక్ష్మణ్‌కు అవకాశం కల్పించే అవకాశం ఉన్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. తెలంగాణలో ఇటీవల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన రాంచందర్‌రావుకు అండగా బండి సంజయ్ విస్తృతంగా రాష్ట్ర పర్యటనలు చేపడతారని.. ఎట్టి



పరిస్థితుల్లోనూ తెలంగాణలో పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ఆయన కృతనిశ్చయంతో ఉన్నారని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

# కమ్యూనిస్టుల సహకారం ఇలాగే కొనసాగాలి



ఈ-కబురు,/ హైదరాబాద్: భవిష్యత్‌లో కాంగ్రెస్, కమ్యూనిస్టుల మధ్య సహకారం ఇలాగే కొనసాగాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పోరాటంలో ఎర్రజెండా కనిపించాలని.. అప్పడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కమ్యూనిస్టుల పోరాటాలు తోడ్పడ్డాయని గుర్తు చేసుకున్నారు. కమ్యూనిస్టులు ఉప్పులాంటివారని, ఉప్పులేని వంట రుచి ఉండదని ముఖ్యమంత్రి అన్నారు. ఆలోచన మీది..పోరాటం మీది.. అధికారం మాదంటూ సీఎం ఛలోక్తి విసిరారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నవ తెలంగాణ దినపత్రిక 10వ వార్షికోత్సవ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

“జర్నలిజంలో ఓనమాలు తెలియని, అక్షర జ్ఞానం లేని కొంతమంది.. జర్నలిస్టు (సోషల్‌మీడియా/ యూట్యూబ్) ముసుగు వేసుకుని తిరుగుతున్నారు. ఆ ముసుగులో అరాచకం సృష్టిస్తున్న వాళ్లను నిజమైన జర్నలిస్టులు లక్షణరేఖతో విడదీయాలి. లేకపోతే దేశ భద్రతకే ప్రమాదకరంగా మారే పరిస్థితి ఏర్పడుతుంది.రాజకీయ నాయకులపై విశ్వసనీయతలాగే జర్నలిస్టులపై విశ్వసనీయత సన్నగిల్లుతోంది. గతంలో తమ భావజాలాన్ని ప్రజలకు వివరించేందుకు కొన్ని రాజకీయ పార్టీలు పత్రికలు నడిపేవి ? కానీ ఈ రోజుల్లో రాజకీయ పార్టీల పత్రికలు వింత పోకడతో వ్యవహరిస్తున్నాయి. నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పనిచేసే పత్రికా సంస్థలు కొన్ని మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం జర్నలిజం ముసుగులో ఉన్న కొన్ని రాజకీయ పార్టీల పత్రికల తీరును ప్రజలు నిశితంగా గమనించాలి” అని సీఎం సూచించారు. దేశంలో మతోన్మాదం పెచ్చరిల్లుతోందని.. కేంద్రం అన్ని వ్యవస్థలను గుప్పిట్లోకి తెచ్చుకొని ప్రమాదంలోకి నెడుతోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు అన్నారు. ఇతర దేశాలు ట్రంప్ పెత్తనాన్ని ధిక్కరిస్తుంటే.. కేంద్రం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. ట్రంప్ వేసే సుంకాలతో తెలంగాణ, హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థపై ఎక్కువ ప్రభావం ఉండనుందన్నారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి, జాన్‌వెస్లీ, వేం నరేందర్‌రెడ్డి, జూలకంటి రంగారెడ్డి, తమ్మినేని వీరభద్రం, నవతెలంగాణ పత్రిక చీఫ్ జనరల్ మేనేజర్ పి.ప్రభాకర్, సంపాదకులు రాంపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల అండదండలా.. అక్రమార్కుల బరితెగింపా..



సిద్దిక్ నగర్ బస్తీ మిగులు భూమిలో కొనసాగుతున్న నిర్మాణ పనులు



సిద్దిక్ నగర్ బస్తీ మిగులు భూమిలో కొనసాగుతున్న నిర్మాణ పనులు




సంవత్సరం క్రితం అదే స్థలంలో బోర్డులు పాతిన రెవెన్యూ అధికారులు (ఫైల్ )

**సిద్దిక్ నగర్ ప్రభుత్వ స్థలంలో మరోసారి నిర్మాణ పనులు**

**నాలుగు నెలల క్రితం కబ్జాను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు**

**తాజాగా నిర్మాణ పనులు చేపట్టిన కబ్జాదారులు**

ఈకబురు, శేరిలింగంపల్లి : ఏడాది క్రితం కబ్జాకు యత్నం. ప్రభుత్వ భూమిని సూచిస్తూ బోర్డులు పాతిన రెవెన్యూ అధికారులు... నాలుగు నెలల క్రితం నిర్మాణ పనులు ప్రారంభం పనులను అడ్డుకున్న మండల కార్యాలయం.. తాజాగా రెండు రోజులగా అదే స్థలంలో జోరందుకున్న నిర్మాణ పనులు ఈ దఫా కార్యాలయం దాటని రెవెన్యూ సిబ్బంది... ఇది సిద్దిక్ నగర్ లోని ఓ ప్రభుత్వ స్థలం ఆక్రమణకు కబ్జాదారులు విడతలవారీగా చేస్తున్న ప్రయత్నం.

హైటెక్ మండలం శేరిలింగంపల్లిలో ప్రభుత్వ భూములు యదేచ్చగా ఆక్రమణకు గురవుతున్నాయి. ప్రభుత్వ భూములతో పాటు భవిష్యత్తు అవసరాల కోసం కాలనీలు, బస్తీలలో వదిలిపెట్టిన మిగులు స్థలాల్లో సైతం కబ్జాదారులు పాగా వేస్తున్నారు. రాత్రికి రాత్రే మిగులు భూములకు నకిలీ డాక్యుమెంట్లను సృష్టిస్తున్న ఆక్రమణదారులు పట్టపగలే యదేచ్చగా కబ్జా చేస్తున్నారు. సిద్దిక్ నగర్‌లో ప్రభుత్వ స్థలాన్ని అక్రమిస్తూ మరోసారి ప్రారంభమైన నిర్మాణ పనులు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

శేరిలింగంపల్లి మండల పరిధిలోని గచ్చిబౌలి సర్వే నెంబర్ 135, 136 లలో అంజయ్య నగర్, సిద్దిక్ నగర్ బస్తీలలో భవిష్యత్ అవసరాల కోసం మిగులు భూములను వదిలిపెట్టారు. ఈ బస్తీల పక్కనే హైటెక్ సిటీ ఏర్పాటు కావడం.. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పుట్టుకు రావడంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దీన్ని ఆసరాగా చేసుకున్న కొంతమంది కబ్జాదారులు సిద్దిక్ నగర్ బస్తీలో ఉన్న మిగులు స్థలాలపై కన్నేశారు. సిద్దిక్ నగర్ బస్తీలో ఉన్న ఖాళీ స్థలంలో గత కొన్ని ఏళ్ల క్రితం దర్గాను ఏర్పాటు చేయగా, దర్గాకు అనుకొని ఉన్న ఖాళీ స్థలం బస్తీ అవసరాలకు ఉపయోగించాలని స్థానికులు భావించారు. కేవలం 100 గజాల స్థలం ఉండడంతో సదరు స్థలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని భావించారు. కాగా కొంతమంది కబ్జాదారులు సదరు స్థలానికి నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి కబ్జాకు ప్రయత్నించగా, గతంలో రెవెన్యూ అధికారులు సదరు స్థలాన్ని కబ్జాభారీ నుంచి కాపాడి ప్రభుత్వ స్థలం బోర్డు ఏర్పాటు చేశారు. గత సంవత్సరం జూన్ లో సదరు స్థలాన్ని కబ్జాదారులు మరోసారి హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నించగా, స్థానికులు ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు 2023 జూన్ 21వ తేదీన అక్రమ కట్టడాలను కూల్చివేసి, ప్రభుత్వ స్థలం బోర్డులు ఏర్పాటు చేశారు. గత నాలుగు నెలల క్రితం సైతం కబ్జాదారులు ఈ స్థలంలో బోరు వేసి నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు.

**మరోసారి నిర్మాణ పనులు..**

తాజాగా గత రెండు రోజులుగా సదరు ప్రభుత్వ స్థలంలో జోరుగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ దఫా ఏకంగా భవన నిర్మాణం కోసం పిల్లర్ల నిర్మాణం చేపట్టిన ఆక్రమణదారులు రాత్రింబవళ్లు పనులు చేపడుతూ కబ్జాను పరిపూర్ణం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇళ్ళ మధ్య.. భవిష్యత్తు అవసరాల కోసం వదిలిపెట్టిన ప్రభుత్వ భూమిలో ఇంత యదేచ్చగా ఆక్రమణ కొనసాగుతుండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత రెవెన్యూ అధికారులు బోర్డులు పాతి కాపాడిన ప్రభుత్వ స్థలాన్ని ప్రస్తుత రెవెన్యూ అధికారుల అండదండలతోనే కబ్జాకు యత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు స్పందించి సిద్దిక్ నగర్ బస్తీ మిగులు స్థలాలను కాపాడడంతో పాటు భవిష్యత్తులో మరోసారి కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మొదటి పేజీ తరువాయి

# అణు బాంబు లాంటి సాక్ష్యం ఉంది

ఈకబురు,/న్యూఢిల్లీ: ఎన్నికల సంఘం(ఈసీ) తీరుపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార బీజేపీకి మేలు చేయడమే లక్ష్యంగా ఈసీ ఓట్ల చౌర్యానికి పాల్పడుతోందని ఆరోపించారు. ఈ ఓట్ల చోరీని నిరూపించడానికి తమ వద్ద అణు బాంబు లాంటి సాక్ష్యం ఉందని స్పష్టంచేశారు. ఈ అణు బాంబు పేలితే దాక్కోవడానికి ఈసీకి దేశంలో ఎక్కడా చోటు దొరకదని అన్నారు. ఓట్ల చౌర్యానికి పాల్పడుతున్న అధికారులు ఎప్పటికైనా శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు. రాహుల్ గాంధీ శుక్రవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. ఓట్ల చౌర్యంపై తమ వద్ద 100 శాతం సాక్ష్యం ఉందన్నారు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) పూర్తయ్యి ముసాయిదా జాబితాను విడుదల చేసిన రోజే ఎన్నికల సంఘంపై రాహుల్ ఆరోపణలు గుప్పించడం గమనార్హం. కొందరి ఓట్లు తొలగించడం, కొత్తగా ఓటర్లను చేర్పించడం



సాధారణ విషయం కాదని ఆయన పేర్కొన్నారు. బీజేపీ కోసమే ఈ తతంగం సాగుతోందన్నారు. 2023లో జరిగిన మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో, గత ఏడాది జరిగిన లోక్‌సభ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అవకతవకలు జరిగినట్లు తమకు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. మహారాష్ట్రలో ఓట్ల చౌర్యం జరిగిందన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరిట ఎన్నికల ముందు కొత్తగా కోట్లాది మంది ఓటర్లను జాబితాలో చేర్చారని పేర్కొన్నారు. దీనిపై పూర్తి వివరాలు ఇవ్వాలని కోరితే ఎన్నికల సంఘం స్పందించలేదని విమర్శించారు. అందుకే తామే సొంతంగా ఆరు నెలలపాటు పరిశోధన చేశామని, అణు బాంబు లాంటి సాక్ష్యం లభించిందని వ్యాఖ్యానించారు. ఓట్లను దొంగతనం చేయడం దేశద్రోహం కంటే తక్కువేమీ కాదన్నారు. అక్రమాలకు పాల్పడిన అధికారులు పదవీ విరమణ చేసి ఎక్కడున్నా సరే వెతికి పట్టుకుంటామని తేల్చిచెప్పారు. దేశానికి వ్యతిరేకంగా పని చేసిన వ్యక్తులకు శిక్ష తప్పదన్నారు.

**రాహుల్ ఆరోపణలు పట్టించుకోవద్దు**

ఓటర్ల జాబితా రూపకల్పనలో అక్రమాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేస్తున్న వరుస ప్రకటనలపై ఎన్నికల సంఘం శుక్రవారం స్పందించింది. బాధ్యతారహితమైన, నిరాధార ఆరోపణలు పట్టించుకోవద్దని.. పారదర్శకంగా, నిజాయతీగా విధులు నిర్వర్తించాలని తమ అధికారులకు సూచించింది. ఓట్ల చౌర్యం అంటూ ప్రతిరోజూ వస్తున్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని తేల్చిచెప్పింది. ఆరోపణల గురించి పట్టించుకోకుండా ఎన్నికల ప్రక్రియ కొనసాగించాలని ఈసీ పేర్కొంది. దేశంలో ఎన్నికలు పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు స్పష్టంచేసింది.

మొదటి పేజీ తరువాయి

# 25 శాతం సుంకాలు ఇక అధికారికం

ఈకబురు,వాషింగ్టన్/న్యూఢిల్లీ: తంపుల మారి ట్రంప్ అన్నంత పనీ చేశారు. భారత్‌పై తాజాగా ప్రకటించిన 25 శాతం సుంకాలపై అమెరికా అధ్యక్షుడు అధికారిక ముద్ర వేశారు. ఈ మేరకు ఉత్తర్వులపై గురువారం సంతకం చేశారు. అంతేగాక పదుల కొద్దీ దేశాలపై కూడా సుంకాల కొరడా ఝుళిపించారు. తద్వారా అంతర్జాతీయంగా మరోసారి వాణిజ్య కల్లోలానికి తెర తీశారు. తాజా జాబితాలో లేని దేశాలకు 10 శాతం టారిఫ్ వర్తిస్తుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అత్యధికంగా సిరియాపై 41 శాతం, పలు దేశాలపై అత్యల్పంగా 10 శాతం టారిఫ్‌లు వడ్డించారు. ఇవి ఆగస్టు 7 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే పాకిస్తాన్‌పై మాత్రం టారిఫ్‌లను 29 నుంచి 19 శాతానికి తగ్గించడం విశేషం. తాజాగా టారిఫ్‌లు విధించిన జాబితాలో 69 దేశాలున్నాయి. మరిన్ని దేశాలు తమతో చర్చలు జరుపుతున్నా, వాటి ప్ర తి పాదనలు పరస్పర వర్తక లోటును పూడ్చేలా లేవంటూ ట్రంప్ పెదవి విరిచారు. ఈ నేపథ్యంలో త్వరలో మరిన్ని టారిఫ్ పెంపుదలలు ఉంటాయని వైట్‌హౌస్ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. దీనిపై అధ్యక్షుడే ప్రకటన చేస్తారన్నారు. ఉత్తర అమెరికా వర్తక ఒప్పందం కింద అమెరికాలోకి ప్రవేశించే కెనడా, మెక్సికో ఉత్పత్తులకు సుంకాల బాదుడు నుంచి మినహాయింపు ఇచ్చారు. అయితే అమెరికాలోకి ఫెంటానిల్ భారీ అక్రమ రవాణాను అడ్డుకోవడంలో కెనడా విఫలమవుతోందని వైట్‌హౌస్ ఆక్షేపించింది. ఈ నేపథ్యంలో దానికి సంబంధించిన ఉత్పత్తులపై టారిఫ్‌లను 25 నుంచి 35 శాతానికి పెంచుతున్నట్టు ప్రకటించింది. మెక్సికోకు మాత్రం పలు ఉత్పత్తులపై విధించిన 30 శాతం టారిఫ్‌లను సంప్రదింపులకు వీలుగా 90 రోజుల గడువిచ్చారు. అయితే ఆటోయేతర, లోహేతర వస్తువులకు మాత్రం గడువు ఇవ్వలేదు. మెక్సికో నుంచి ఉక్కు, అల్యూమినియం, రాగిపై 50 శాతం టారిఫ్‌లు, ఆటో ఉత్పత్తులపై 25 శాతం తప్పవని వైట్‌హౌస్ స్పష్టం చేసింది. ట్రంప్ కొద్ది నెలల క్రితం ప్రపంచ దేశాలపై ప్రకటించిన టారిఫ్‌లు ఆగస్టు 1 నుంచే అమల్లోకి రావడం తెలిసిందే. భారత ఆర్థిక వ్యవస్థ మృతప్రాయమైనది అంటూ బుధవారం ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. మన ఎగుమతులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్టు తాజా ఉత్తర్వుల్లో ఆయన పునరుద్ఘాటించారు. రష్యా నుంచి భారీగా చమురు, ఆయుధాలు కొనుగోలు చేస్తున్నందుకు ప్రకటించిన పెనాల్టీ శాతాన్ని మాత్రం తాజా ఉత్తర్వుల్లో వెల్లడించలేదు. వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు అంశాల్లో అమెరికా ప్రమేయాన్ని అంగీకరించేందుకు భారత్ ఇప్పటికే ససేమిరా అనడం తెలిసిందే. అమెరికాపై భారత్ సుంకాలు దారుణంగా ఉన్నాయంటూ ట్రంప్ ఇటీవలే విమర్శించడం, దేశ ప్రయోజనాలను అన్ని రకాలుగా కాపాడతామని కేంద్రం ప్రకటించడం తెలిసిందే. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల నడుమ చర్చలు కొనసాగుతుండగానే బుధవారం ట్రంప్ 25 శాతం సుంకాలు బాదారు. ఇక అమెరికాకు ఎగుమతులపై 15 శాతం టారిఫ్‌లకు దక్షిణ కొరియా ఇప్పటికే అంగీకరించింది. వాటిపై 25 శాతం బాదుడు తప్పదంటూ ట్రంప్ తొలుత హెచ్చరించారు. దాంతో ఆయన నిర్ణయించే అమెరికా ప్రాజెక్టుల్లో 350 బిలియన్ల మేరకు పెట్టుబడికి ఒప్పుకుంది. ఇక అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటైన చైనాపై టారిఫ్‌లను ట్రంప్ ఏ మేరకు నిర్ణయిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఆగస్టు 12 నాటికి ఒప్పందం కుదుర్చుకోవాల్సిందిగా ఆ దేశానికి ఆయన ఇప్పటికే అల్టిమేటమివ్వడం తెలిసిందే. ఇరు దేశాల నడుమ పలు అంశాలపై వర్తక విభేదాలు కొనసాగుతున్నాయి.



**దేశ ప్రయోజనాలు కాపాడతాం: కేంద్రం**

ట్రంప్ వ్యాఖ్యలు, తాజా ఉత్తర్వులపై కేంద్రం ఆచితూచి స్పందించింది. “ద్వైపాక్షిక వాణిజ్య భాగస్వామ్యం అనేక ఆటుపోట్లను ఎదుర్కొని నిలిచింది. ఇరు దేశాలు విశ్వసించే ఎజెండాకు కట్టుబడి ఉన్నాం. ఈ బంధం సజావుగా సాగుతుందని విశ్వసిస్తున్నాం” అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లకు ప్రతీకారంగా జరిమానా విధిస్తామన్న ట్రంప్ ప్రకటనను మీడియా ప్రస్తావించగా ఈ విషయంలో జాతి ప్రయోజనాలకు అనుగుణంగా మాత్రమే నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ‘ఎఫ్–35’ కొనుగోళ్లు బంద్!

ఈకబురు,/ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్యలకు భారత ప్రభుత్వం ప్రతిచర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తమ ఉత్పత్తులపై ఏకంగా 25 శాతం సుంకాలు విధించడం, రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తే అదనపు జరిమానాలు విధిస్తామని హెచ్చరించడం భారత్‌ను పునరాలోచనలో పడేశాయి. ట్రంప్ దూకుడుకు విరుగుడుగా అమెరికా నుంచి రక్షణ పరికరాల కొనుగోలును విరమించుకోవాలని ఇండియా నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

ప్రధానంగా ఎఫ్-35 యుద్ధ విమానాల కొనుగోలును పూర్తిగా నిలిపి వేయనున్నట్లు తెలిసింది. ట్రంప్ ఇటీవల భారత్‌పై కారాలు మిరియాలు నూరుతున్నారు. సోషల్ మీడి యాలో వరుసగా పోస్టులు చేస్తున్నారు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ తర్వాత ఇండియాపై అమెరికా అధ్యక్షుడి మాటల దాడి మరింత తీవ్రమైంది. పాకిస్తాన్‌కు అనుకూలంగా వ్యవహ రిస్తున్నారు. పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌ను వైట్ హౌస్ ఆహ్వా నించి, విందు ఇచ్చారు. ఇండియా ఉత్పత్తులపై 25 శాతం టారిఫ్‌లు విధించనున్నట్లు తాజాగా ప్రకటించారు. ఒకవైపు భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతుండగానే ట్రంప్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారు. భారత్‌తో తమకు వాణిజ్య లోటు ఉందని, దీన్ని కచ్చితంగా తగ్గిస్తామని ట్రంప్ తేల్చిచెప్పారు. ఈ పరిణామా లన్నీ భారత్‌కు ఇబ్బందికరంగా మారాయి. అమెరికాతో చర్చలు జరుపలేదు

రక్షణ రంగంలో భారత్-అమెరికా మధ్య సన్నిహిత సంబంధాలున్నాయి. అమెరికా రక్షణ పరికరాలు, ఆయుధాలు, సైనిక రవాణా విమానాలను భారత్ ఉపయోగిస్తోంది. మరోవైపు ఎఫ్-35 యుద్ధ విమానాలను భారత్‌కు విక్రయించాలని డొనాల్డ్ ట్రంప్ గట్టి పట్టుదలతో ఉన్నారు. తద్వారా వేల కోట్ల డాలర్లు ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోదీ అమెరికాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇరుదేశాలు చేసిన సంయుక్త ప్రకటనలో ఎఫ్-35 యుద్ధ విమానాల అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అయితే, ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో ఈ యుద్ధ విమానాల కొనుగోలుపై భారత ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లు బ్లూబర్గ్ సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. ట్రంప్ ఆఫర్‌ను తిరస్కరిస్తున్నట్లు తెలిపింది. సమీప భవిష్యత్తులోనూ వీటిని కొనే అవకాశం లేదని పేర్కొంది. మరోవైపు ఎఫ్-35 యుద్ధ విమానాల కోసం అమెరికా ప్రభుత్వంతో అధికారికంగా ఎలాంటి చర్చలు జరుపలేదని విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ తేల్చిచెప్పారు. ఇదిలా ఉండగా, వాణిజ్య లోటుపై ట్రంప్ అభ్యంతరాల నేపథ్యంలో అమెరికా నుంచి సహజ వాయువు, కమ్యూనికేషన్ పరికరాలు, బంగారం కొనుగోళ్లు పెంచాలని భారత ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతీకార చర్యల్లో భాగంగా అమెరికా ఉత్పత్తులపై భారీగా సుంకాలు పెంచే అవకాశం ఉన్నప్పటికీ ప్రస్తుతానికి అందుకు దూరంగా ఉండాలని భారత ప్రభుత్వం నిర్ణయానికొచ్చింది. అమెరికాతో నెలకొన్న సమస్యలు త్వరలో పరిష్కారమవుతాయని అంచనా వేస్తోంది.



# అమెరికాకే ఎక్కువ నష్టం

**ఔషధాలకు అదనపు సుంకాలపై పరిశ్రమ అంచనా**

**ప్రత్యామ్నాయ మార్కెట్లపై కంపెనీల దృష్టి**



హైదరాబాద్: మనదేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే ఔషధాలపైనా నేటి నుంచి సుంకాల భారం అధికం కానుంది. దీని వల్ల మన కంపెనీలకు జరిగే నష్టం కంటే, ధరలు పెరిగి అమెరికా ప్రజలపైనే అధిక భారం పడుతుందని పరిశ్రమ వర్గాలు వివరిస్తున్నాయి. మనదేశం నుంచి అమెరికా దిగుమతి చేసుకునే అన్ని వస్తువులపై 25%+ పన్నులు వేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం విదితమే. మందులూ ఈ జాబితాలోకి రావడం, ఫార్మాస్యూటికల్స్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీనివల్ల కలిగే నష్టాలను అంచనా వేసి, దానిని ఎదుర్కొనే మార్గాలు, ప్రత్యామ్నాయాలపై సంబంధిత వర్గాలు దృష్టి సారిస్తున్నాయి.

**మూడోవంతు అక్కడికే**

గత ఆర్థిక సంవత్సరంలో మనదేశం 30.47 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.65 లక్షల కోట్ల) విలువైన మందులు ఎగుమతి చేసింది. ఇందులో మూడో వంతు అమెరికాకే చేరాయి. ఇందులో ప్రధానంగా ఏపీఐ (యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రేడియంట్స్) ఔషధాలు, ఫార్ములేషన్లు (ట్యాబ్లెట్లు, క్యాప్సూల్స్, ఇంజెక్షన్లు) ఉంటాయి. అమెరికాలో గతేడాది దాదాపు 138 బిలియన్ డాలర్ల (సుమారు రూ.12 లక్షల కోట్ల) విలువైన జనరిక్ ఔషధాల అమ్మకాలు నమోదయ్యాయి. 2033 నాటికి ఈ మార్కెట్ 188 బిలియన్ డాలర్ల (సుమారు రూ.16.35 లక్షల కోట్ల) కు పెరుగుతుందని అంచనా. ఈ విభాగంలో మన ఫార్మా కంపెనీలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ కంపెనీలు ఏటా అత్యధిక సంఖ్యలో డీఎంఎఫ్, ఏఎన్‌డీఏ దరఖాస్తులను అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) వద్ద దాఖలు చేస్తున్నాయి. అమెరికా వెలుపల అత్యధిక సంఖ్యలో యూఎస్ఎఫ్‌డీఏ అనుమతి గల యూనిట్లు ఉన్నది మనదేశంలోనే.

**మందులు కొనక తప్పదు**

ట్రంప్ ఎంత అధికంగా సుంకాలు విధించినా, తప్పనిసరి కాబట్టి మందులు కొనుగోలు చేయక తప్పదు. ఆ భారాన్ని అమెరికా ప్రజలే మోయాల్సి ఉంటుందని స్థానిక ఫార్మా పరిశ్రమ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. తాత్కాలికంగా మనదేశం నుంచి మందులు ఎగుమతులు తగ్గినా, మళ్లీ త్వరగానే సాధారణ స్థితికి చేరతాయని అన్నారు. అదనపు సుంకాల భారాన్ని ఇక్కడి కంపెనీలు కొంతమేర భరిస్తాయని, మిగిలింది అమెరికా ప్రజల మీదే పడుతుందని వివరించారు. మనదేశం ఎంతో తక్కువ ధరలో నాణ్యమైన మందులు సరఫరా చేస్తుండటమే ఇందుకు కారణం. ట్రంప్ నిర్ణయం వల్ల అమెరికాలో మందుల ధరలు పెరగడంతో పాటు, మందుల కొరత కూడా ఎదురుకావచ్చని ఫార్మాగ్జెల్ (ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్) ఛైర్మన్ నమిత్ జోషి పేర్కొన్నారు. కొరియా, జపాన్, చైనా మార్కెట్లకు మనదేశం నుంచి మందుల ఎగుమతులు తక్కువ. ఇకపై ఈ దేశాలతో పాటు ఆగ్నేయాసియా దేశాలకూ అధికంగా ఎగుమతి చేయటానికి స్థానిక ఫార్మా కంపెనీలు ప్రయత్నాలు చేపడతాయి. ఆఫ్రికా, ఐరోపా, దక్షిణ అమెరికా దేశాల్లో అమ్మకాలు పెంచుకునే యత్నాలను ముమ్మరం చేస్తాయని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. భారత ప్రభుత్వం అమెరికాతో సంప్రదింపులు ముమ్మరం చేసి.. సుంకాల భారాన్ని తగ్గించేందుకు ప్రయత్నించాలని పరిశ్రమ ప్రతినిధులు కోరుతున్నారు.

**అరబిందోకు కలిసిరానున్న కొనుగోలు**

అమెరికాలో 400 కోట్ల డోసుల తయారీ సామర్థ్యం ఉన్న లానెట్ కంపెనీని కొనుగోలు చేయడం కోసం అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. 250 మి. డాలర్ల (రూ.2185 కోట్లు) ఎంటర్‌ప్రైజ్ విలువతో ఈ కొనుగోలు వల్ల అమెరికా ప్రభుత్వ ప్రొక్యూర్‌మెంట్‌లోనూ అరబిందో పాల్గొనే వీలు కలగనుంది. అమెరికాలో ఔషధ పంపిణీ సులభం కానుంది.




# వివో నుంచి సరికొత్త ఫోన్.. ధర, ఫీచర్స్ ఇవే

ఇండియన్ మార్కెట్లోకి రకరకాల మొబైల్ ఫోన్స్ వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే వివో నుంచి... సరికొత్త స్మార్ట్ ఫోన్ లాంచ్ కాబోతోంది. V60 పేరుతో ఈ కొత్త మొబైల్ తీసుకువస్తున్నారు. ఈ మొబైల్ ఫోన్ ఆగస్టు 12వ తేదీన మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఇండియన్ మార్కెట్లో లాంచ్ కాబోతోంది. మరి ఈ ఫోన్ వివరాలు ఒకసారి పరిశీలిస్తే.... మూడు కలర్స్ లో ఈ మొబైల్ ఫోన్ లభించబోతోంది. గోల్డ్, బ్లూ, గ్రే కలర్స్ లో ఈ ఫోన్ లభిస్తుంది. ఇక ఈ వివో మొబైల్ ఫోన్ 50 మెగాపిక్సల్ కలిగి ఉంటుంది. ఇక సెల్ఫీల కోసం కూడా మంచి కెమెరాలు అందిస్తున్నారు. ఈ మొబైల్ ఫోన్ బ్యాటరీ సామర్థ్యం 6500 mah గా ఉంది. 90 W ఫ్లాష్ చార్జ్ కు మాత్రమే ఈ మొబైల్ ఫోన్ మద్దతు ఇస్తుంది అని కంపెనీ వెల్లడించింది. ఈ మొబైల్ ఫోన్ ఇండియాలోనే అత్యంత సన్నని మొబైల్ గా కంపెనీ పేర్కొంది.

# జూలైలో 7.5 శాతం పెరిగిన జీఎస్టీ వసూళ్లు

దేశంలో వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) వసూళ్లు మరోసారి రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. శుక్రవారం కేంద్రం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, జూలై నెలలో రూ. 1.96 లక్షల కోట్ల జీఎస్టీ ఆదాయం వచ్చింది. ఇది గతేడాది ఇదే నెలలో వచ్చిన మొత్తంతో పోలిస్తే 7.5 శాతం ఎక్కువ. ఈ వసూళ్లు ఆర్థిక కార్యకలాపాలు, అన్ని రంగాల్లో కొనసాగుతున్న మెరుగైన పనితీరును ప్రతిబింబిస్తుందని ప్రభుత్వం తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో వచ్చిన జీఎస్టీ ఆదాయం రూ. 2.37 లక్షల కోట్లు ఇప్పటివరకు ఆల్‌టైమ్ రికార్డు స్థాయిలో ఉన్నాయి. జూలై జీఎస్టీ ఆదాయం మొత్తం రూ. 1,96,000 కోట్లలో ఐజీఎస్టీ రూ.99,250 కోట్లు, సీజీఎస్టీ రూ.33,450 కోట్లు, ఎస్‌జీఎస్టీ రూ.41,600 కోట్లు, సెస్ రూ.21,700 కోట్లు ఉన్నాయి. ముఖ్యంగా, దిగుమతుల నుండి సేకరించిన ఐజీఎస్టీ 10.3 శాతం పెరగడం విశేషం. ఇది పటిష్టమైన సరిహద్దు వాణిజ్యాన్ని సూచిస్తుంది. ఇక, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్‌జూలై మధ్య జీఎస్టీ వసూళ్లు 10.7 శాతం పెరిగి రూ.8.18 లక్షల కోట్లకు చేరుకున్నాయి. సమీక్షించిన కాలంలో దేశీయ లావాదేవీల నుంచి స్థూల జీఎస్టీ ఆదాయం 6.7 శాతం పెరిగి రూ.1.43 లక్షల కోట్లకు చేరుకున్నాయి. దిగుమతుల నుంచి 9.7 శాతం అధికంగా రూ.52,712 కోట్ల ఆదాయం వచ్చింది. జూలై జీఎస్టీ వసూళ్లలో అత్యధికంగా మధ్యప్రదేశ్ 18 శాతం వృద్ధిని చూసింది. ఆ తర్వాత బీహార్ 16 శాతం, ఆంధ్రప్రదేశ్ 14 శాతం, పశ్చిమ బెంగాల్ 12 శాతంతో జీఎస్టీ వసూళ్లలో వృద్ధిని సాధించాయి. మహారాష్ట్ర రూ.30,590 కోట్లతో అత్యధిక జీఎస్టీ ఆదాయం సంపాదించింది. దీని తర్వాత కర్ణాటక రూ.13,967 కోట్లు, గుజరాత్ రూ.11,358 కోట్లు సాధించాయి.




# లోన్ ఫ్రాడ్ కేసులో అనిల్ అంబానీపై లుకౌట్ నోటీసులు

**ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ గ్రూప్ అధినేత అనిల్ అంబానీకి చిక్కులు తప్పేలా లేవు. తాజాగా రూ. 3,000 కోట్ల విలువైన రుణ మోసానికి సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దేశం విడిచి వెళ్లకుండా ఉండేందుకు శుక్రవారం లుకౌట్ నోటీసులు జారీ చేసింది. దీంతో కోర్టు అనుమతి లేకుండా అనిల్ అంబానీ ఇకపై దేశం విడిచి ప్రయాణించడానికి వీలుండదు. అనిల్ అంబానీకి చెందిన కంపెనీలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను దారి మళ్లించడానికి, ఆర్థిక సంస్థలను తప్పుదారి పట్టించడానికి భాగస్వామ్యం ఉన్నట్టు ఈడీ తన ప్రాథమిక దర్యాప్తులో తేల్చింది. ఇందులో 2017-2019 మధ్య యెస్ బ్యాంక్ నుంచి తీసుకున్న దాదాపు రూ. 3,000 కోట్ల విలువైన రుణాలను అక్రమంగా మళ్లించిన వ్యవహారంలో లుకౌట్ నోటీసులు ఇచ్చింది.**





దీనికి ముందు ఈ విషయానికి సంబంధించి ఆగస్టు 5న విచారణకు హాజరవ్వాలని అనిల్ అంబానీకి ఈడీ సమన్లు జారీ చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనున్నారు. గత వారం ముంబైలోని 35 ప్రదేశాలలో అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్‌తో సంబంధం ఉన్న 50 కంపెనీలు, 25 మంది వ్యక్తులపై మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద 35 చోట్ల ఈడీ సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ముఖ్యమైన డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలోనే తాజా ఈడీ సమన్లు, లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి.

**నకిలీ బ్యాంక్ గ్యారెంటీ**

ఈడీ అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం.. దర్యాప్తులో అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలు సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)కి సమర్పించిన రూ. 68.2 కోట్ల నకిలీ బ్యాంక్ గ్యారెంటీకి మధ్య సంబంధాలు బయటపడ్డాయి. అడాగ్ గ్రూప్‌తో అనుబంధంగా ఉన్న రిలయన్స్ ఎన్‌యూ బీఈఎస్ఎస్ లిమిటెడ్, మహారాష్ట్ర ఎనర్జీ జనరేషన్ లిమిటెడ్ పేర్లతో ఈ బోగస్ గ్యారెంటీ జారీ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ గ్యారెంటీ పూర్తిగా కల్పితమని, ఎస్‌బీఐని మోసం చేసే ఉద్దేశంతో నకిలీ కమ్యూనికేషన్ల ద్వారా ఇచ్చినట్టు ఈడీ కనుగొంది. ముఖ్యంగా, ఈ నకిలీ గ్యారెంటీని నిజమైనదిగా చూపించడానికి సెకీతో కలిసి నకిలీ ఈమెయిల్ డొమైన్‌ను ఉపయోగించినట్టు తేలింది. మోసపూరిత ఈమెయిల్ వ్యవహారం, డిజిటల్ వివరాలను తెలుసుకోవడానికి ఈడీ నేషనల్ ఇంటర్నెట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ఐఎక్స్ఐ) నుంచి డొమైన్ రిజిస్ట్రేషన్ రికార్డులను సేకరించింది.

**ఇంకా ఎన్నో ఆరోపణలు**

మరోవైపు, 201719 మధ్యకాలంలో రిలయన్స్ గ్రూప్ కంపెనీలపై యెస్ బ్యాంకు ఇచ్చిన రూ. 3,000 కోట్ల రుణాలు కూడా చట్టవ్యతిరేకంగా దారి మళ్లించినట్టు అభియోగాలు ఉన్నాయి. యెస్ బ్యాంకు మాజీ ప్రమోటర్లకు లంచం ఇచ్చారనే ఆరోపణలున్నాయి. ఇక, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తీసుకున్న రూ. 10 వేల కోట్ల రుణాలను సైతం దారి మళ్లించడం, ఆర్‌కామ్, కెనరా బ్యాంకు మధ్య రూ. 1,050 కోట్ల రుణ మోసం, రిలయన్స్ మ్యూచువల్ ఫండ్ ఏటీ1 బాండ్లలో రూ. 2,850 కోట్ల పెట్టుబడుల విషయంలో క్విడ్ ప్రోకో వ్యవహారం ఇలా అనిల్ అంబానీపై అనేక రకాల బ్యాంకు రుణ మోశాలు ఉన్నాయని ఈడీ చెబుతోంది.

# రష్యా చమురు కొనుగోలు ఆగిందా..? అందులో నిజమెంత..!



**దిల్లీ:** ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యాపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ మాస్కో నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడంపై పశ్చిమ దేశాలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. దీనిపై న్యూదిల్లీ ఎప్పటికప్పుడు స్పష్టతనిస్తున్నప్పటికీ.. దీన్ని ఓ కారణంగా చూపుతూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. భారత్‌పై పెనాల్టీలు ప్రకటించారు. ఈ పరిణామాల నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను దేశీయ సంస్థ నిలిపివేశాయంటూ వార్తలు వస్తున్నాయి.


భారత్‌కు చెందిన ప్రభుత్వ చమురు శుద్ధి సంస్థలు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, మంగళూరు రిఫైనరీ పెట్రోకెమికల్ లిమిటెడ్ వంటి సంస్థలు గత వారం రోజులుగా మాస్కో నుంచి ముడిచమురు కొనుగోలు చేయడం లేదంటూ వార్తలు వచ్చాయి. రిఫైనరీ సంస్థలకు చెందిన విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ కథనం ప్రచురించింది. అయితే, దీనిపై ఆయా సంస్థల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఓ సీనియర్ అధికారి స్పందించారు. ఇప్పటివరకు అలాంటి ఆదేశాలేమీ ప్రభుత్వం జారీ చేయలేదని వెల్లడించినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

ప్రపంచంలోనే భారత్ మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారుగా ఉంది. దీంతో ఆర్థిక వ్యవస్థ సవాళ్లను దృష్టిలోపెట్టుకొని రష్యా నుంచి డిస్కౌంట్ ధరకు ముడి చమురు ధరను న్యూదిల్లీ కొనుగోలు చేస్తోంది. భారత్‌కు వస్తున్న మొత్తం ఇంధన సరఫరాలో దాదాపు 35శాతం మాస్కో చమురే. అయితే, దీనిపై అమెరికా సహా పలు పశ్చిమదేశాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. భారత్ కొంటున్న చమురుతోనే ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని రష్యా కొనసాగించగలుగుతోందని, ఇదే న్యూదిల్లీతో వాణిజ్య చర్చల్లో తమను ఇబ్బందిపెట్టే అంశమని అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియో అన్నారు. ఇటీవల ట్రంప్ కూడా దీనిపై మాట్లాడుతూ.. రష్యాతో వాణిజ్యం కారణంగా భారత్‌పై 25% సుంకాలతోపాటు పెనాల్టీ విధిస్తున్నట్లు తెలిపారు.

# దేశంలో తొలి ఛార్జింగ్ స్టేషన్ ప్రారంభించనున్న టెస్లా




ఎలన్ మస్క్‌కు చెందిన ఎలక్ట్రిక్ కార్ల సంస్థ టెస్లా ఇటీవలే దేశంలో తన మొదటి షోరూమ్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. తాజాగా ముంబైలో కంపెనీ తన మొదటి ఛార్జింగ్ స్టేషన్‌ను వచ్చే వారం ప్రారంభించనున్నట్టు ప్రకటించింది. టెస్లా తొలి ఛార్జింగ్ స్టేషన్‌లో నాలుగు వీ4 సూప్రర్ ఛార్జింగ్ స్టాల్స్(డీసీ ఛార్జింగ్), నాలుగు డెస్టినేషన్ ఛార్జింగ్ స్టాల్స్(ఏసీ ఛార్జింగ్) ఉంటాయని తెలిపింది. టెస్లా సూపర్‌చార్జింగ్ స్టాల్స్ కిలోవాట్‌కు రూ. 24 నుంచి, 250 కిలోవాట్ గరిష్ట ఛార్జింగ్ స్పీడ్, డెస్టినేషన్ ఛార్జర్లు కిలోవాట్‌కు రూ. 14తో 11 కిలోవాట్ అందిస్తాయని పేర్కొంది. టెస్లా ప్రకటించినట్టుగా దేశంలో ఏర్పాటు చేయబోయే ఎనిమిది సూపర్‌చార్జింగ్ సైట్‌లలో ఇది మొదటిది. టెస్లా సూపర్‌ఛార్జర్లతో కంపెనీ దేశంలో విడుదల చేసిన మోడల్ వై కారు కేవలం 15 నిమిషాల్లో 267 కిలోమీటర్ల రేంజ్ ఛార్జింగ్ అవుతుంది. ఇది ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం, గేట్‌వే ఆఫ్ ఇండియా మధ్య 5 సార్లు ప్రయాణించడానికి సరిపోతుందని టెస్లా వెల్లడించింది.



# 'బలగం'లోని 'ఊరు పల్లెటూరు' పాటకు నేషనల్ అవార్డు


2023 సంవత్సరానికి జాతీయ చలనచిత్ర అవార్డులను జ్యూరీ ప్రకటించింది. అందులో తెలంగాణ చిత్రం బలగంకు సైతం అవార్డు దక్కింది. బలగం సినిమాలోని ఊరు పల్లెటూరు పాటకు గాను బెస్ట్ లిరిక్స్ అవార్డు దక్కింది. ఈ పాటను కాసర్ల శ్యామ్ రాయగా సింగర్ మంగ్లీ, రామ్ మిరియాల కలిసి పాడారు. శ్రోతలను ఎంతగానో మెప్పించిన ఈ పాట యూట్యూబ్‌ను షేక్ చేసింది. సినిమా విడుదలైన తరవాత ప్రతి ఒక్కరి నోటి నుండి ఇదే పాట వినిపించింది. పల్లెటూరి గొప్పదనాన్ని వివరిస్తూ ఉన్న లిరిక్స్‌కు ప్రజలు ఫిదా అయ్యారు. ఇక ఈ చిత్రానికి వేణు టిల్లు దర్శకత్వం వహించగా ప్రియదర్శి హీరోగా నటించారు. సినిమాలో ప్రియదర్శికి జోడీగా కావ్య హీరోయిన్‌గా నటించింది. తెలంగాణ బ్యాక్ డ్రాప్‌లో వచ్చిన ఈ సినిమా ప్రేక్షలను ఎంతగానో ఆకట్టుకుంది.



# తొలి సినిమాతోనే సత్తా చాటిన సుకుమార్ కూతురు







71వ జాతీయ చలన చిత్ర అవార్డుల జాబితాలను కేంద్రం ప్రకటించింది. డైరెక్టర్ సుకుమార్ కూతురు సుక్రతి కి నేషనల్ అవార్డు లభించింది. ఉత్తమ బాలనటిగా ఎంపికైంది. గాంధీ తాత చెట్టు సినిమాకు గాను ఈ అవార్డు లభించింది. సుకృతి వేణి, ఆనంద్ చక్రపాణి, రఘురామ్, భాను ప్రకాష్, నేహాల్ ఆనంద్ కుంకుమ, రాగ్ మయూర్ తదితరులు నటించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో నవీన్, రవిశంకర్ నిర్మించారు. మల్లాది పద్మావతి దర్శకత్వం వహించారు. అలాగే.. ఉత్తమ తెలుగు చిత్రంగా బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరిని అవార్డు వరించింది. ఉత్తమ యాక్షన్ (స్టంట్ కొరియోగ్రఫీ)లో 'హనుమాన్' చిత్రం అవార్డు దక్కించుకోగా, ఉత్తమ గేయ రచయితగా 'బలగం'లో 'ఊరు పల్లెటూరు' పాటకు గానూ కాసర్ల శ్యామ్ అవార్డును సొంతం చేసుకున్నారు. ఇక ఉత్తమ తమిళ చిత్రంగా 'పార్కింగ్'కు అవార్డు దక్కింది. బెస్ట్ ఫిల్మ్ క్రిటిక్ అవార్డు ఉత్పల్ దత్త (అస్సామీ)కు ప్రకటించారు. తొలుత నాన్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరి అవార్డులను వెల్లడించారు.

# ఉత్తమ తెలుగు చిత్రం 'భగవంత్ కేసరి'.. ఉత్తమ పాట 'ఊరు పల్లెటూరు'

**71వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్రం ప్రకటించింది. ఈ సారి తెలుగు చిత్రాలకు అవార్డుల పంట పండింది. ఉత్తమ తెలుగు చిత్రంగా బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి'ని అవార్డు వరించింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీలో శ్రీలీల, కాజల్, అర్జున్ రాంపాల్ కీలక పాత్రలు పోషించారు. వినోదం, యాక్షన్, సందేశం మేళవించి అనిల్ రావిపూడి ఈ మూవీని తీర్చిదిద్దారు.**




**జాతీయ స్థాయిలో అదరగొట్టిన హను-మాన్..**

చిన్న చిత్రంగా విడుదలై బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షాన్ని కురిపించిన చిత్రం 'హనుమాన్' . తేజ సజ్జా కథానాయకుడిగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీకి రెండు కేటగిరిల్లో అవార్డులు దక్కాయి. ఉత్తమ యాక్షన్ (స్టంట్ కొరియోగ్రఫీ), ఉత్తమ యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్ విభాగాల్లో 'హనుమాన్'కు అవార్డులకు ఎంపికైంది. ఉత్తమ గేయ రచయితగా కాసర్ల శ్యామ్‌కు జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. తెలంగాణ పల్లె వాతావరణం, అనుబంధాల నేపథ్యంలో వేణు యెల్దండి దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'బలగం' . భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చగా, 'ఊరు పల్లెటూరు' అంటూ అందరి హృదయాలను హత్తుకునేలా సాహిత్యం అందించిన కాసర్ల శ్యామ్‌కు అవార్డు దక్కింది.

**అవార్డుల్లోనూ సంచనలమే..**

తెలుగులో యువతను విశేషంగా ఆకట్టుకున్న మూవీ 'బేబీ' . వైష్ణవి చైతన్య, ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్ కీలక పాత్రల్లో రూపొందిన రొమాంటిక్ డ్రామా ఇది. ఉత్తమ స్క్రీన్‌ప్లేకి గానూ దర్శకుడు సాయి రాజేశ్‌ను జాతీయ అవార్డు వరించింది. అలాగే ఇందులో 'ప్రేమిస్తున్నా' పాట పాడిన నేపథ్య గాయకుడు పీవీఎన్ఎస్ రోహిత్ కూడా ఉత్తమ గాయకుడిగా ఎంపికయ్యారు. విజయ్ బుల్గానిన్ సంగీత దర్శకత్వం ఇందులోని పాటలు యూత్‌ను మెస్మరైజ్ చేశాయి. ఇక 'గాంధీతాత చెట్టు'లో నటనకు గానూ ఉత్తమ బాల నటిగా సుకృతి వేణి జాతీయ చలన చిత్ర అవార్డుకు ఎంపికైంది. పద్మావతి మల్లాది దర్శకత్వం వహించిన ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది.జాతీయ చలన చిత్ర పురస్కారాలకు సంబంధించిన వార్తలను పాఠకులు ఆసక్తిగా చదువుతుండటంతో గూగుల్‌లో ట్రెండ్ అవుతున్నాయి.

# బ్యాక్‌గ్రౌండ్ ఉన్నా.. నన్ను నాలుగు సినిమాల్లో రిజెక్ట్ చేశారు.. హీరో షాకింగ్ కామెంట్స్



**చాలా గ్యాప్ తర్వాత హీరో సుమంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'అనగనగా' . సన్నీ సంజయ్ దర్శకత్వం వహించిన ఈ మూవీ డైరెక్ట్‌గా ఓటీటీలోకి వచ్చి మంచి సక్సెస్ అందుకుంది. నేటి విద్యావ్యవస్థలోని లోపాలను, దాని తీరుతెన్నులను ప్రశ్నిస్తూ, తండ్రీ కొడుకుల మధ్య ఉన్న అనుబంధాన్ని చక్కగా భావోద్వేగభరితంగా చూపించడంతో.. వయసుతో సంబంధం లేకుండా అందరిని ఈ మూవీ ఆకట్టుంది. ఈ క్రమంలోనే ఈ సినిమాతో సక్సెస్‌తో వరుస ఇంటర్వ్యూస్ ఇస్తున్నారు టీమ్.**

ఇందులో భాగంగానే తాజాగా హీరో సుమంత్, డైరెక్టర్ సన్నీ సంజయ్ ఓ చిట్‌చాట్‌లో పాల్గొన్నారు. ఈ చిట్‌చాట్‌లో సినీ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వాళ్లకు ఆడిషన్స్ చేస్తారా అనే ప్రశ్న ఎదురు కాగా.. సుమంత్ స్పందిస్తూ.. 'సినీ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నా కూడా ఆఫర్లు రావడం కష్టమే అవుతుంది. ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వడం ఈజీ కానీ.. నిలదొక్కడం కష్టం. ఓ స్థాయి వరకు బ్యాక్‌గ్రౌండ్ ఉన్నవాళ్లకు హెల్ప్‌ఫుల్‌గా ఉంటుంది తర్వాత.. ఎవ్వరైనా ఆడిషన్ ఇవ్వాల్సిందే. కొన్నాళ్ల క్రితం నేను కూడా నాలుగైదు హిందీ ప్రాజెక్టులకు ఆడిషన్స్ ఇచ్చా. రిజెక్ట్ అయ్యాను. హిందీ భాష రాకపోవడంతో వాళ్లు నన్ను రిజెక్ట్ చేశారు అనుకుంటున్నా. అంతే కానీ, బ్యాక్‌గ్రౌండ్ ఉంది కదా అని తీసేసుకోరు' అని తెలిపాడు.




# "బేబీ" నేషనల్ అవార్డులు సాధించడంపై స్పందించిన డైరెక్టర్

బేబీ సినిమాకు రెండు నేషనల్ అవార్డులు రావడంపై డైరెక్టర్ సాయి రాజేష్ స్పందించారు. బేబీకి బెస్ట్ స్క్రీన్ ప్లే, బెస్ట్ మెయిల్ సింగర్ క్యాటగిరీల్లో అవార్డులు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. స్క్రీన్ ప్లేకు అవార్డు రావడం అనేది చాలా పెద్ద విషయం అన్నారు. కలర్ ఫోటో సమయంలో అవకాశం ఉండే అని కానీ ఈసారి చాలా మంచి సినిమాలు పోటీలో ఉండటంతో వస్తుందని ఊహించలేదన్నారు. బేబీపై వచ్చిన విమర్శలు నిజం అయితే సినిమా అంత పెద్ద హిట్ అయ్యేది కాదని, ఇన్ని అవార్డులు వచ్చేవి కాదన్నారు. కలర్ ఫోటో సినిమాకు నేషనల్ అవార్డు కోసం చాలా కష్టపడి అప్లై చేశామన్నారు. కానీ ఆ సినిమాకు రాలేదని చెప్పారు. మనిషిలో మంచి చెడులు రెండు ఉంటాయని అవి చూపించే విధంగా బేబీ కథ రాసుకున్నట్టు తెలిపారు. ప్రస్తుతం హిందీలో బేబీ సినిమాను తెరకెక్కించడంతో పాటు చెన్నై లవ్ స్టోరీస్ సినిమాకు నిర్మాతగా వ్యవహరిస్తున్నానని తెలిపారు.



# '12th ఫెయిల్'.. నేషనల్ అవార్డ్స్‌లో డబుల్ 'సక్సెస్'.. రెండు విభాగాల్లో ది బెస్ట్




**పేరులోనే 'ఫెయిల్'గానీ ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో, ఆలోచింపజేయడంలో, స్ఫూర్తినింపడంలో ఎంతో 'సక్సెస్' అయింది '12th ఫెయిల్' . ఇప్పటికే ఎన్నో పురస్కారాలు దక్కించుకున్న ఈ సినిమా.. 71వ నేషనల్ అవార్డ్స్ లో మెరిసింది. తాజాగా ప్రకటించిన అవార్డుల జాబితాలో ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు (విక్రాంత్ మాస్సే) విభాగాల్లో సత్తా చాటిన ఈ సినిమా ఏం నేర్పుతుంది?**

**నిజ జీవిత కథ..**

ఐపీఎస్ అధికారి మనోజ్ కుమార్ శర్మ జీవితాధారంగా తెరకెక్కిన సినిమా ఇది. మధ్యప్రదేశ్‌లోని చంబల్‌లోయ ప్రాంతమైన మౌర్యానాకు చెందిన మనోజ్ కుమార్ శర్మ (విక్రాంత్ మాస్సే)ది నిరుపేద కుటుంబం. తినడానికి సరిగా తిండి లేని పరిస్థితి. మనోజ్ తండ్రి పనిలో నిజాయతీగా ఉన్నాడన్న కారణంతో సస్పెండ్ అవుతాడు. మరోవైపు, కాపీ కొట్టమని విద్యార్థులను ప్రోత్సహిస్తుండటంతో మనోజ్ చదివే పాఠశాల హెడ్‌మాస్టర్‌ను డీఎస్పీ జైలుకు పంపుతాడు. అందరూ నిజాయతీగా ఉండాలని విద్యార్థులకు చెబుతాడు. డీఎస్పీ దుష్యంత్ మాటలను స్ఫూర్తిగా తీసుకుని మనోజ్ ఏం చేశాడు? 12th ఫెయిల్ అయినా సివిల్స్ వైపు అతడి పయనం ఎలా సాగింది? ఈ క్రమంలో మనోజ్‌కు ఎదురైన సవాళ్ల సమాహారమే ఈ చిత్రం. ఓటీటీ 'డిస్నీ+ హాట్‌స్టార్'లో స్ట్రీమింగ్ అవుతోంది.

**సమాధానం.. స్ఫూర్తిదాయకం**

నేటి విద్యా వ్యవస్థ లోపాల్ని ఎత్తి చూపే చిత్రమిది. ప్రభుత్వాల అలసత్వం, అధికారమే పరమావధిగా సాగే రాజకీయాలు, కొందరు ఉపాధ్యాయుల నిర్లక్ష్య వైఖరి, తల్లిదండ్రుల అమాయకత్వం, పేదరికం వెరసి కొందరు విద్యార్థుల జీవితాలు ఎలా నాశనమవుతున్నాయనేది కళ్లకు కడుతుంది. సివిల్స్ ఇంటర్వ్యూ ఎపిసోడ్ ఈ సినిమాకి కీలకం. పుస్తకాలతో కుస్తీ పట్టిన జ్ఞానంతోకాకుండా స్వీయ అనుభవ సారంతో మనోజ్ చెప్పే సమాధానాలు నిరాశలో ఉన్న ఎంతోమందిని కదిలిస్తాయి. "ఐపీఎస్ కావడమే నా లక్ష్యం కాదు. దేశంలో సంస్కరణలు తీసుకురావడం. ఎంపిక కాకపోతే గ్రామానికి వెళ్లి పిల్లలకు పాఠాలు చెప్పుకొంటా. జీవితంలో చీటింగ్ చేయకుండా ఎలా బతకాలో చెబుతా. అలాంటి వాళ్ల జీవితం ఎంత గొప్పగా ఉంటుందో వివరిస్తా. 'నేను భూమికి వెలుగునిచ్చేటంత సూర్యుడిని కాలేకపోతే, కనీసం నా వీధిలో వెలుగునిచ్చే దీపాన్ని అవుతా" అనే మాట చాలు కదా ఈ సినిమా ఎంతగా ప్రభావం చేయగలదో చెప్పేందుకు.

**ప్రముఖుల ప్రశంసలు..**

సగటు ప్రేక్షకుడితోపాటు ఎంతోమంది ప్రముఖులూ ఈ చిత్రంపై ప్రశంసలు కురిపించారు. 'గొప్ప సందేశమిచ్చే చిత్రం' అని సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ పేర్కొన్నారు. 'యే దిల్ మాంగే మోర్' అంటూ ఇలాంటి మంచి సినిమాలు మరిన్ని తీయాలని '12th ఫెయిల్' టీమ్‌కి ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా విజ్ఞప్తి చేయడం విశేషం.

**విక్రాంత్ తీవ్ర శ్రమ..**

బలమైన కథ ఉంటే సరిపోదు. దాన్ని భుజాన వేసుకుని నడిపించే బలమైన నటుడు ఉంటేనే విజయం వరిస్తుంది. '12th ఫెయిల్' విషయంలో ఆ క్రెడిట్ విక్రాంత్ మాస్సేకే. బయోపిక్‌కు తగ్గట్టు సహజంగా నటించేందుకు ఆయన పడిన కష్టం వృథా పోలేదు. నల్లగా కనిపించాలని దర్శకుడు విధు వినోద్ చోప్రా చెబితే.. ఫెయిర్‌గా ఉండే విక్రాంత్ డీ గ్లామర్‌గా కనిపించేందుకు ఆవనూనె ఒంటికి పట్టించి, దాదాపు మూడు గంటలపాటు ఎండలో ఉండేవారు. భుజాలపై చర్మం ఊడిపోయిందని, స్కిన్ ఇన్‌ఫెక్షన్ కూడా వచ్చిందని ఓ సందర్భంలో తెలిపారు. ఎంపిక చేసుకున్న పాత్ర కోసం ఆయన ఎంతగా కష్టపడతారో దాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

# రెచ్చిపోయిన భారత బౌలర్లు.. ఇంగ్లాండ్ ఆలౌట్



లండన్‌లోని ఓవల్ మైదానం వేదికగా జరుగుతోన్న ఐదో టెస్టులో భారత బౌలర్లు అదరగొట్టారు. తొలి ఇన్సింగ్స్‌లో ఇంగ్లాండ్‌ను 247 పరుగులకే కట్టడి చేయగలిగారు. ఓవరాల్‌గా పది వికెట్లు కోల్పోయిన ఇంగ్లండ్.. 247 పరుగులు చేసి.. భారత్ ఎదుట 23 పరుగుల లీడ్ పెట్టింది. ఇంగ్లండ్ బ్యాటర్లలో జాక్ (64), డకెట్ (43), బ్రూక్ (53), రూట్ (29), పోప్ (23) తప్ప ఎవరూ రాణించలేదు. భారత బౌలర్లలో మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ చెరో నాలుగు వికెట్లు తీయగా, ఆకాశ్ దీప్ ఒక వికెట్ తీశారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన టీమిండియా కూడా ఆలౌట్ అయింది. స్వల్ప 224 పరుగులకే అందరూ చేతులెత్తేశారు. భారత బ్యాటర్లలో కరుణ్ నాయక్ (57), సాయి సుదర్శన్ (38), సుందర్ (26), గిల్ (22) తప్ప ఎవరూ రాణించలేదు. ఇంగ్లండ్ బౌలర్లలో అట్కిన్సన్ ఐదు వికెట్లు, జోష్ టంగ్ మూడు వికెట్లు, క్రిస్ వోక్స్ ఒక వికెట్ తీశారు.

**247 పరుగుల వద్ద ముగిసిన ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్**

తెందూల్కర్ అండర్సన్ ట్రోఫీలో భాగంగా ఓవల్ వేదికగా ఇంగ్లాండ్, టీమ్ఇండియా అయిదో టెస్ట్ మ్యాచ్ ఆడుతున్నాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లాండ్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో భారత జట్టు మొదట బ్యాటింగ్‌కు దిగింది. టీమ్ఇండియా.. తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులు చేయగలిగింది. కరుణ్ నాయర్ 57 టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ 247 పరుగులు చేసింది.

భారత తొలి ఇన్నింగ్స్ సందర్భంగా క్రిస్ వోక్స్ ఫీల్డింగ్ చేస్తూ గాయపడటం వల్ల బ్యాటింగ్‌కు రాలేదు. ఇంగ్లాండ్ బ్యాటర్లలో జాక్ క్రాలీ (64), బెన్‌డకెట్ (43), హ్యారీ బ్రూక్ (53) రాణించారు. భారత బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్ తలో నాలుగు వికెట్లు తీసుకున్నారు. ఆకాశ్ దీప్ ఒక వికెట్ పడగొట్టాడు. ఇంగ్లాండ్ జట్టు 23 పరుగులతో స్వల్ప ఆధిక్యం సాధించింది.





# సిరాజ్ డబుల్ సెంచరీ

ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదో టెస్ట్‌లో టీమిండియా స్టార్ పేసర్ మొహమ్మద్ సిరాజ్ ఓ అరుదైన మైలురాయిని తాకాడు. ఈ మ్యాచ్‌లో ఓలీ పోప్ వికెట్ తీయడంతో అంతర్జాతీయ క్రికెట్‌లో 200 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. సిరాజ్ 41 టెస్ట్ మ్యాచ్‌ల్లో 117 వికెట్లు.. 44 వన్డేల్లో 71 వికెట్లు.. 16 టీ20ల్లో 14 వికెట్లు తీశాడు.

ఈ మ్యాచ్‌లో సిరాజ్ ఓలీ పోప్ వికెట్ తర్వాత మరో రెండు వికెట్లు కూడా తీశాడు. జో రూట్, బేకబ్ బేతెల్‌లను పెవిలియన్‌కు పంపాడు. ఈ మ్యాచ్‌లో సిరాజ్ ఇప్పటివరకు 3 వికెట్లు తీశాడు. సిరాజ్ తీసిన 3 వికెట్లు ఎల్బీడబ్ల్యూలే కావడం విశేషం.

సిరాజ్ చెలరేగడంతో టీమిండియా మ్యాచ్‌పై ఆశలు సజీవంగా ఉంచుకుంది. సిరాజ్‌తో పాటు ఆకాశ్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణ (తలో వికెట్) కూడా తలో చేయి వేయడంతో ఇంగ్లండ్ 195 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో జాక్ క్రాలే (64), బెన్ డకెట్ (43), ఓలీ పోప్ (22), జో రూట్ (29), జేకబ్ బేతెల్ (6) ఔట్ కాగా.. హ్యారీ బ్రూక్ (22), జేమీ స్మిత్ (5) క్రీజ్‌లో ఉన్నారు.

అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులకే ఆలౌటైంది. భారత ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ 2, కేఎల్ రాహుల్ 14, సాయి సుదర్శన్ 38, శుభ్‌మన్ గిల్ 21, కరుణ్ నాయర్ 57, రవీంద్ర జడేజా 9, ధ్రువ్ జురెల్ 19, వాషింగ్టన్ సుందర్ 26, సిరాజ్, ప్రసిద్ధ్ డకౌట్ అయ్యారు. కాగా, ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ 12తో వెనుకపడిన విషయం తెలిసిందే



# సచిన్ రికార్డు బద్దలు కొట్టిన రూట్

**ఓవల్ వేదికగా భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న ఐదో టెస్ట్ రసవత్తరంగా సాగుతుంది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులకే ఆలౌట్ కాగా.. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 242 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి పతనం అంచుల్లో ఉంది.**

ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ స్టార్ ఆటగాడు జో రూట్ (29) పెద్దగా ఆకట్టుకోలేకపోయినా, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉండిన ఓ రికార్డును బద్దలు కొట్టాడు. సచిన్ తన కెరీర్‌లో స్వదేశంలో జరిగిన టెస్ట్‌ల్లో 7216 పరుగులు చేయగా.. తాజాగా ఇన్నింగ్స్‌తో రూట్ (7220) సచిన్ రికార్డును అధిగమించాడు.

ఈ విభాగంలో ఆసీస్ లెజెండ్ రికీ పాంటింగ్ (7578) అగ్రస్థానంలో ఉండగా.. రూట్ సచిన్‌ను వెనక్కునెట్టి రెండో స్థానానికి ఎగబాకాడు.

**స్వదేశంలో టెస్టుల్లో అత్యధిక పరుగులు..**

**7578 - రికీ పాంటింగ్ - ఆస్ట్రేలియా**
**7220* - జో రూట్ - ఇంగ్లండ్***
**7216 - సచిన్ టెండూల్కర్ - ఇండియా**
**7167 - మహేల జయవర్ధనే - శ్రీలంక**
**7035 - జాక్వెస్ కల్లిస్ - దక్షిణాఫ్రికా**

మ్యాచ్ విషయానికొస్తే.. తొలి ఇన్నింగ్స్ ఇంగ్లండ్ పతనాన్ని వరుణుడు అడ్డుకున్నాడు. 242 పరుగులకు 8 వికెట్లు కోల్పోయిన దశలో ఒక్కసారిగా భారీ వర్షం ప్రారంభమైంది. ప్రస్తుతం ఇంగ్లండ్ భారత్ తొలి ఇన్నింగ్స్ స్కోర్ దాటి 18 పరుగుల ఆధిక్యంలో ఉంది. హ్యారీ బ్రూక్ (48), జోష్ టంగ్ (0) క్రీజ్‌లో ఉన్నారు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో క్రిస్ వోక్స్ ఆడే అవకాశం లేదు. గాయం కారణంగా వోక్స్ తదుపరి మ్యాచ్‌కు అందుబాటులో లేదు. తొలి రోజు ఆట సందర్భంగా వోక్స్ భుజానికి తీవ్ర గాయమైంది.

# నన్ను మోసగాడు అన్నారు.. సూసైడ్ ఆలోచనలూ వచ్చాయ్: చాహల్



**కొరియాగ్రాఫర్, ఇన్‌ఫ్ల్యూయెన్సర్ ధనశ్రీ వర్మ, భారత సీనియర్ క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ విడిపోయిన సంగతి తెలిసిందే. 2020లో వివాహం చేసుకున్న వీరిద్దరూ తమ బంధానికి ఇటీవలే ముగింపు పలికారు. విడాకుల తర్వాత తాను చాలా విమర్శలు ఎదుర్కొన్నానని తాజాగా చాహల్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. కొందరు తనను 'మోసగాడు' అంటూ లేబుల్ వేశారని.. కొన్నిసార్లు సూసైడ్ ఆలోచనలూ వచ్చాయని తెలిపాడు.**


''ధనశ్రీతో విడాకులు తీసుకున్నాక నన్ను చాలామంది మోసగాడిగా అభివర్ణించారు. అయితే, నేనెప్పుడూ ఎవరినీ మోసం చేయలేదు. చాలా నమ్మకమైన వ్యక్తిని. నాలాంటి పర్సన్‌ను మీరు చూడరు. నా అనుకున్న వారి గురించి చాలా జాగ్రత్తగా ఉంటా. కొంతమందికి నా విషయంలో ఏం జరిగిందో కూడా తెలియదు. కానీ, నన్ను తప్పుబట్టడం చూశా. మేమిద్దరం మా కెరీర్‌లో సక్సెస్ కావాలని అనుకున్నాం. దీంతో రిలేషన్‌షిప్‌కు ప్రాధాన్యం ఇవ్వడం కష్టమైంది. మా ఇద్దరి మధ్య భావోద్వేగ సంబంధాలు తెగిపోయాయి. ఇలాంటప్పుడు రాజీ పడాల్సిన అవసరం ఉంది. కానీ, ఇద్దరి ఆశయాలు, వ్యక్తిత్వాలు ఒకే మార్గంలో లేకపోతే అది రిలేషన్‌షిప్‌పై ప్రభావం చూపుతుంది. కెరీర్ కీలక సమయంలో ఒక్కోసారి భాగస్వామికి సమయం కేటాయించడం కష్టం అవుతుంది. అలాంటప్పుడు మరొకరు అర్థం చేసుకోవాలి. ఇద్దరు వేర్వేరు లక్ష్యాలు కలిగిన వ్యక్తులు ఒకేచోట ఉన్నప్పుడు మద్దతు ఇచ్చుకోవడం కీలకం'' అని చాహల్ వెల్లడించాడు.

**చాలా విమర్శలు ఎదుర్కొన్నా..**

''నేను విడాకులు తీసుకున్నాక.. చాలా విమర్శలు ఎదుర్కొన్నా. మోసగాడంటూ కామెంట్లు చేశారు. మహిళలను గౌరవించడం రాదంటూ ఆరోపించారు. కానీ, నాకూ ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. వారితో కలిసి పెరిగా. మహిళలను ఎలా గౌరవించాలనేది నాకు తెలుసు. నా తల్లిదండ్రులు ఆ సంస్కారం నేర్పించారు. అలాగే చుట్టుపక్కల వారి నుంచీ చాలా విషయాలు నేర్చుకుంటూనే ఉంటా. అయితే, నా పేరును ఇతరులతో లింక్ చేసి చాలా కథనాలు రాశారు. కేవలం వారి వ్యూస్ కోసమే ఇదంతా చేశారు. నా వ్యక్తిగత జీవితం గురించి స్క్రూటినీ చేసినప్పుడు తీవ్ర ఆందోళన చెందా. రోజులో కేవలం 2 గంటలే నిద్ర పోయిన సందర్భాలూ ఉన్నాయి. ఇలా దాదాపు 45 రోజులపాటు కంటిమీద కునుకు లేదు. క్రికెట్ నుంచి విరామం తీసుకున్నా. ఏ విషయం పైనా ఏకాగ్రత పెట్టలేకపోయా. ఐదు నెలలపాటు తీవ్ర ఒత్తిడికి గురయ్యా. నా స్నేహితుడితో కొన్నిసార్లు ఆత్మహత్య ఆలోచనలూ షేర్ చేసుకున్నా. చాలా భయమేసింది'' అని చాహల్ వ్యాఖ్యానించాడు.

**స్నేహితులు, మహ్‌వషా సపోర్ట్‌తో..**

''నా వ్యక్తిగత జీవితంలో ఎదురైన ఒడిదొడుకుల గురించి ఎక్కువగా స్నేహితులతోనే చర్చించేవాడిని. కుటుంబసభ్యుల్లో అనవసరమైన టెన్షన్‌ను తీసుకురావడం నాకిష్టం ఉండదు. ప్రాతిక్ పవార్, ఆర్‌జే మహ్‌వషాతోపాటు ఇతర స్నేహితులతో పంచుకొనేవాడిని. వారివల్లే మళ్లీ మామూలు మనిషిగా తయారయ్యా. ఇప్పుడూ వారంతా నాతోనే ఉన్నారు'' అని భారత క్రికెటర్ వెల్లడించాడు.



# ఓటమితో వీడ్కోలు.. టెన్నిస్ స్టార్ కన్నీటి పర్యంతం

**ఓటమితో టెన్నిస్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన కెనడా ప్లేయర్**

**మాంట్రియల్:** కెనడాకు చెందిన టెన్నిస్ ప్లేయర్ జెనీ బుచార్డ్ ఆటకు వీడ్కోలు పలికింది. సొంతగడ్డపై అభిమానుల సమక్షంలో కెరీర్‌లో చివరి మ్యాచ్ ఆడేసింది. నేషనల్ బ్యాంక్ ఓపెన్‌లో భాగంగా గురువారం మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో బుచార్డ్ 2-6, 6-3, 4-6తో 17వ సీడ్ బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్) చేతిలో ఓడింది.

తొలి రౌండ్‌లో పోరాడి గెలిచిన బుచార్డ్... రెండో రౌండ్‌లో అదే ఆటతీరు కనబర్చలేకపోయింది. 2 గంటల 16 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో... తొలి సెట్‌లో ఓడిన బుచార్డ్... ఆ తర్వాత పుంజుకుంది.

రెండో సెట్ గెలిచి... మూడో సెట్‌లోనూ చక్కటి పోరాటం కనబర్చినా... కీలక సమయాల్లో ఆధిక్యం కనబర్చిన బెన్‌చిచ్ విజయం సాధించింది.

**ప్రత్యేక అనుబంధం**

'మాంట్రియల్‌తో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. కెరీర్ ఆరంభించినప్పటి నుంచి ఏదో ఒక రోజు ఇదే మైదానంలో ఆటకు వీడ్కోలు పలకాలని బలంగా అనుకునే దాన్ని. ఇప్పుడు ఆ రోజు వచ్చేసింది. ఇదో భావోద్వేగ సందర్భం.

కెరీర్‌లో సాధించిన దాంతో సంతృప్తిగా ఉన్నా' అని బుచార్డ్ పేర్కొంది. 2014లో కెరీర్ అత్యుత్తమ దశలో ఉన్న సమయంలో బుచార్డ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా 5వ స్థానానికి చేరింది.

ఆ ఏడాదే కెరీర్‌లో ఏకైక డబ్ల్యూటీఏ సింగిల్స్ టైటిల్ నెగ్గిన ఆమె.... ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో సెమీఫైనల్‌కు చేరింది. 2014లో వింబుల్డన్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచింది. ఆ తర్వాత ఆ స్థాయి ప్రదర్శన కనబర్చలేకపోయిన బుచార్డ్... తిరిగి పుంజుకోలేకపోయింది.



**కన్నీటి పర్యంతం**

'ఎన్నో కష్టనష్టాలు ఓర్చి ఇక్కడి వరకు వచ్చా. టెన్నిస్ ధ్యాసలో పడి చదువుకు దూరమయ్యా. ఇష్టాలను వదులుకొని ఎంతో కష్టపడితేనే ఈ స్థాయికి చేరుకున్నా. నేను ఆటకు ఎంతో ఇచ్చాను. ఇక ఆటకు వీడ్కోలు పలికి ఇతర విషయాలపై దృష్టి పెట్టాలనుకుంటున్నా.

టెన్నిస్ నాకు తిరిగిచ్చిన దాంతో సంతృప్తిగా ఉన్నా. చిన్నప్పుడు ఈ మైదానంలో కూర్చొని మ్యాచ్‌లు వీక్షించేదాన్ని. ఏదో ఒక రోజు ఈ కోర్టులో అడుగు పెట్టాలని కలలు కనేదాన్ని. అది నిజం చేసుకొని సగర్వంగా ఇక్కడే ఆటకు వీడ్కోలు పలుకుతున్నా' అని మ్యాచ్ అనంతరం బుచార్డ్ కన్నీటి పర్యంతమైంది.